ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి
5
అనకాపల్లి
జిల్లా వార్తలు
మంగళవారం 18 ఫిబ్రవరి 2025



పరిశోధన పరుగుపెట్టేలా..!

- పరిశోధకులకు అవసరమైన పరికరాలను అందించే ఐ స్టెమ్
- స్టార్టప్ ఎంటర్‌ప్రెన్యూర్స్, పరిశ్రమ నిర్వాహకులకు మేలు
- లాగిన్ అయిన ఏయూ, గీతం, ఐఐపీఈ వర్సిటీలు, విశాఖలో 20కి పైగా కాలేజీల్లోని ఆర్ అండ్ డీ ల్యాబ్‌లు

. 8లో

మరో ఫెర్రో కంపెనీ మూత

నేటి నుంచి విధులకు రావద్దంటూ 'రాజరాజేశ్వరి' కంపెనీ యాజమాన్యం ప్రకటన

- ఆందోళనకు దిగిన కార్మికులు
- నమ్మించి నట్టేట ముంచారంటూ ఆగ్రహం
- ముందస్తు నోటీసు, బకాయి జీతాలు ఎందుకు ఇవ్వలేదని నిలదీత
- ఈనెల 25న జీతాలు చెల్లిస్తామని యాజమాన్యం హామీ
- తాత్కాలికంగా ఆందోళన విరమించిన కార్మికులు



ఫెర్రో కంపెనీ ఎదుట ఆందోళన చేస్తున్న కార్మికులు

అచ్యుతాపురం, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రత్యేక ఆర్థిక మండలి (సెజ్)లోని రాజరాజేశ్వరి లలితా త్రిపుర సుందరి ఫెర్రో ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ యాజమాన్యం తమను నమ్మించి నట్టేట ముంచిందని కార్మికులు తీవ్రస్థాయిలో మండిపడుతున్నారు. మంగళవారం నుంచి కార్మికులు ఎవరూ విధులకు రావాల్సిన అవసరం లేదని యాజమాన్య ప్రతినిధులు ప్రకటించడంతో కార్మికులు సోమవారం ఆందోళనకు దిగారు. కర్మాగారంలో ఉత్పత్తి అయిన సరకును బయటకు తరలించే వరకు తమను బుజ్జగించిందని, ఇప్పుడు కంపెనీలో పనులు లేవంటూ మాయమాటలు చెబుతున్నదని ధ్వజమెత్తారు. ఇందుకు సంబంధించి పూర్వాపరాలిలా వున్నాయి.

ప్రత్యేక ఆర్థిక మండలిలో రాజరాజేశ్వరి లలితా త్రిపుర సుందరి ఫెర్రో ప్రైవేట్ లిమిటెడ్ కర్మాగారంలో సుమారు 550 ఉద్యోగులు, కార్మికులు పనిచేస్తున్నారు. ఫెర్రో ఉత్పత్తుల ధరలు అంతర్జాతీయంగా పడిపోవడంతో, గత ప్రభుత్వం విద్యుత్ ప్రోత్సహకాలు అందజేయకపోవడంతో ఆర్థిక ఇబ్బందులు ఎదురయ్యాయి. దీంతో విద్యుత్ బకాయిలు పేరుకుపోవడంతో జనవరి 23న ఈపీడీసీఎల్ అధికారులు, ఈ కర్మాగారానికి విద్యుత్ సరఫరా నిలిపివేశారు. దీంతో కర్మాగారంలో ఉత్పత్తి నిలిచిపోయింది. కార్మికులకు పనిలేకుండా పోయింది. విద్యుత్ బకాయిలు చెల్లించి ఉత్పత్తిని పునరుద్ధరిస్తామని యాజమాన్యం చెప్పింది. అనంతరం కంపెనీ యాజమాన్యం.. ముడిసరకుతో పాటు ఫెర్రో ఉత్పత్తులను కంటైనర్ల ద్వారా బయటకు తరలించడం ప్రారంభించింది. ఈ విషయం ఆలస్యంగా తెలుసుకున్న కార్మికులు ఈ నెల నాలుగో తేదీన కంపెనీకి వచ్చి ఆందోళనకు దిగారు. కంటైనర్లు కర్మాగారంలోకి వెళ్లకుండా అడ్డుకున్నారు. జీతాల బకాయిలు ఇవ్వకుండా, కర్మాగారం మూసేస్తున్నామని చెప్పకుండా.. గుట్టుచప్పుడు కాకుండా కర్మాగారంలో ఉన్న ముడిసరకుతోపాటు ఫెర్రో ఉత్పత్తులను ఎలా తరలిస్తారంటూ యాజమాన్య ప్రతినిధులపై మండిపడ్డారు. దీంతో కంగుతిన్న యాజమాన్యం.. "కర్మాగారం మూసేస్తామని ఎవరు చెప్పారు? చట్టప్రకారం కార్మికులకు ముందస్తు నోటీసులు ఇవ్వకుండా

... మిగతా 8వ పేజీలో

నీరు-చెట్టు బిల్లులకు మోక్షం

- వివరాలు అప్‌లోడ్ చేయాల్సిందిగా ప్రభుత్వ ఆదేశం
- ఉమ్మడి జిల్లాలో 616 పనులకు సంబంధించి రూ.39.1 కోట్లు పెండింగ్
- గత తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో పనులు
- బిల్లులు చెల్లింపునకు వైసీపీ ప్రభుత్వం బ్రేక్
- కూటమి ప్రభుత్వం రావడంతో కదలిక

విశాఖపట్నం, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): జాతీయ ఉపాధి హామీ పథకం కింద గత తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో నీరు-చెట్టుకింద చేపట్టిన పనులకు సంబంధించిన బిల్లులకు త్వరలో మోక్షం లభించనున్నది. ఉమ్మడి జిల్లాలో ఈ పథకం కింద 616 పనులకు రూ.39.1 కోట్ల బిల్లులు చెల్లించాల్సి ఉంది. కూటమి అధికారంలోకి వచ్చిన తరువాత నీరు-చెట్టు పథకం బిల్లులపై ప్రజా ప్రతినిధుల నుంచి ఒత్తిడి రావడంతో సీఎం చంద్రబాబునాయుడు స్పందించారు. ఈ నేపథ్యంలో పెండింగ్‌లో ఉన్న బిల్లులు తక్షణమే మరోసారి అప్‌లోడ్ చేయాలని జల వనరుల శాఖను ఆదేశించారు. అందులోనూ కోర్టుకు వెళ్లినవారి బిల్లులకు తొలి ప్రాధాన్యం ఇవ్వాలన్నారు.

జల వనరుల శాఖ పరిధిలో 2017 నుంచి 2019 వరకు నీరు-చెట్టు కింద చెరువులు, కాల్వల మరమ్మతులు, పూడికతీత, పొదల తొలగింపు, తూములు, మదుములు మరమ్మతులు చేపట్టారు. 2019లో ఎన్నికల నోటిఫికేషన్ విడుదలయ్యే నాటికి కొన్ని బిల్లులు చెల్లించారు. వైసీపీ అధికారంలోకి వచ్చేసరికి ఉమ్మడి జిల్లాలో 720 పనులకు సంబంధించి రూ.43 కోట్లు చెల్లించాల్సి ఉంది. బిల్లుల చెల్లింపునకు గత పాలకులు మొండికేయడంతో పనులు చేపట్టిన నీటి సంఘాల ప్రతినిధులు ఆందోళన చేశారు. దీంతో పనుల్లో అవకతవకలు జరిగాయని పేర్కొంటూ విజిలెన్స్ విభాగంతో

... మిగతా 8వ పేజీలో

బెల్లం తయారీకి హైబ్రిడ్ యూనిట్

- సౌరశక్తితో చెరకు క్రషింగ్
- బయోమాస్ గ్యాసీఫైయిర్‌తో బెల్లం ఉత్పత్తి
- అనకాపల్లి ఆర్ఏఆర్ఎస్ శాస్త్రవేత్తల రూపకల్పన
- చెరకు క్రషింగ్, బెల్లం తయారీలో సమయం, డబ్బులు ఆదా
- నాణ్యమైన బెల్లం తయారీతో ఎగుమతులకు ఆస్కారం

అనకాపల్లి అగ్రికల్చర్, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): అనకాపల్లి వ్యవసాయ పరిశోధనా స్థానం వ్యవసాయ ఇంజనీరింగ్ శాస్త్రవేత్తలు సోలార్ బయోమాస్ హైబ్రిడ్ బెల్లం తయారీ యూనిట్‌ను రూపొందించారు. ఆధునిక బెల్లం పరిశోధనా ప్రాజెక్టులో ఇదొక మైలురాయిగా చెప్పొచ్చు. ఈ హైబ్రిడ్ బెల్లం తయారీ యూనిట్‌లో సౌరశక్తిని ఉపయోగించి చెరకు క్రషింగ్, బయోగ్యాసీఫెయిర్‌తో చెరకు రసాన్ని మరిగించడం అనే రెండు పద్ధతులు ముఖ్యమైనవి. ఈ రెండింటిని రూపొందించడమే కాకుండా వీటిని ప్రామాణీకరించామని పోస్టు హార్వెస్టు



రైతులు ప్రస్తుతం పాటిస్తున్న బెల్లం తయారీ విధానం



బెల్లం తయారీ కోసం బయోమాస్ గ్యాసీఫెయిర్‌తో చెరకు రసాన్ని మరిగిస్తున్న దృశ్యం

టెక్నాలజీ ఇంజనీరింగ్ విభాగాధిపతి డాక్టర్ పీవీకే జగన్నాథరావు తెలిపారు. సోమవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ, సోలార్ బయోమాస్ హైబ్రిడ్ విధానంలో బెల్లం తయారీ వల్ల సమయం, డబ్బు, శ్రమ ఆదా అవడమేకాక నాణ్యమైన బెల్లం ఉత్పత్తి అవుతుందని చెప్పారు. చెరకు రసాన్ని మరిగించేటప్పుడు వెలువడే కర్బన్ ఉద్గారాలు బయోగ్యాసీఫెయిర్ వల్ల తగ్గిపోయి, పర్యావరణానికి మేలు చేస్తాయని వివరించారు.

సోలార్ క్రషర్

బెల్లం తయారు చేసే రైతులు ఇప్పటి వరకు విద్యుత్ మోటార్లతో చెరకు క్రషింగ్ చేస్తున్నారు. వ్యవసాయ రంగానికి ప్రభుత్వం తొమ్మిది గంటలపాటు మాత్రమే త్రీఫేజ్ విద్యుత్ సరఫరా చేస్తున్నది. అంతేకాక వివిధ కారణాల వల్ల విద్యుత్ సరఫరా నిలిచిపోతూ వుంటుంది. అప్పటి వరకు తీసిన చెరకు రసం ఒక బెల్లం పాకం తయారీకి చాలకపోతే మళ్లీ కరెంటు వచ్చే వరకు వేచివుండాల్సి వుంటుంది. దీంతో చెరకు రసం పులిసిపోతుంది. ఇటువంటి రసంతో తయారైన బెల్లం నాణ్యత లోపిస్తుంది. ఇందుకు ప్రతిగా విద్యుత్ క్రషర్‌కు 28 ప్యానళ్ల సౌరశక్తి కనెక్షన్ ఇచ్చినట్టయితే

... మిగతా 8వ పేజీలో

బెల్లం రైతులకు అవగాహన కల్పిస్తాం

- డాక్టర్ పీవీకే జగన్నాథరావు, పోస్టుహార్వెస్టు టెక్నాలజీ విభాగం అధిపతి



సోలార్ బయోమాస్ హైబ్రిడ్ బెల్లం తయారీ యూనిట్‌లపై రైతులకు అవగాహన కల్పిస్తాం. ఇటీవల ఒడిశా నుంచి ఫీల్డ్ విజిట్‌కు ఇక్కడకు వచ్చిన బెల్లం రైతులకు ఆర్ఏఆర్ఎస్‌లో సోలార్ బయోమాస్ హైబ్రిడ్ బెల్లం తయారీ విధానాన్ని చూపించాం. ఏటా సుమారు ఆరున్నర మిలియన్ టన్నుల బెల్లం ఉత్పత్తితో మనదేశం ప్రథమ స్థానంలో ఉంది. ప్రపంచ బెల్లం ఉత్పత్తిలో ఇది 65 శాతం. అయితే ఎగుమతిలో బాగా వెనుకబడ్డాం. నాణ్యత మెరుగుపడితే ఎగుమతులు బాగా పెరిగి రైతులకు మేలు చేకూరుతుంది. నాణ్యమైన బెల్లం తయారీకి, వ్యయాన్ని తగ్గించుకోవడానికి సోలార్ బయోమాస్ హైబ్రిడ్ యూనిట్‌లు ఎంతో దోహదపడతాయి. చెరకు క్రషింగ్ చేసే మోటారుకు సోలార్ యూనిట్‌ను అమర్చుకోవడానికి అయ్యే ఖర్చులో ప్రభుత్వం 60 శాతం సబ్సిడీగా ఇస్తున్నది. బెల్లం తయారీకి బయోమాస్ గ్యాస్‌ఫెయిర్ ఏర్పాటుకు రూ.2.5 లక్షలు ఖర్చు అవుతుంది.

సీసీ రోడ్ల బిల్లులకు నిరీక్షణ

- రెండు నెలల నుంచి విడుదల కాని నిధులు
- నర్సీపట్నం నియోజకవర్గంలో రూ.6.6 కోట్లు పెండింగ్
- అమలుకాని 'గురువారం బిల్లుల చెల్లింపు' ప్రకటన

నర్సీపట్నం, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ పథకం మెటీరియల్ కాంపోనెంట్ కింద గ్రామాల్లో సిమెంట్ కాంక్రీట్ (సీసీ) రోడ్లు నిర్మించిన కాంట్రాక్టర్లు బిల్లుల కోసం వారాల తరబడి నిరీక్షిస్తున్నారు. నర్సీపట్నం నియోజకవర్గంలో ఆరున్నర కోట్ల రూపాయలకుపైగా బిల్లులు పెండింగ్‌లో వున్నాయి. ఉపాధి నిధులతో చేపట్టిన పనులకు ప్రతి గురువారం బిల్లుల చెల్లింపు ఉంటుందన్న ప్రభుత్వ ప్రకటన రెండు నెలల నుంచి అమలు కావడంలేదని కాంట్రాక్టర్లు చెబుతున్నారు.

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ఉపాధి హామీ పథకం నిధులతో గ్రామాల్లో సిమెంట్ రోడ్ల నిర్మాణానికి అత్యధిక ప్రాధాన్యం ఇచ్చింది. స్థానిక కూటమి నాయకుల సిఫారసుతో పంచాయతీ రాజ్ శాఖ అధికారులు ప్రతిపాదించిన పనులకు వెంటనే ఆమోదించింది. పనులు పూర్తిచేసి, ఆన్‌లైన్‌లో బిల్లులు అప్‌లోడ్ చేసిన కొద్ది రోజులకే నిధులు విడుదల అవుతాయని అధికారులు చెప్పడంతో నామినేషన్ విధానంలో స్థానిక కాంట్రాక్టర్లు, కూటమి పార్టీలకుచెందిన



మాకవరపాలెం మండలం పైడిపాలలో నిర్మాణం పూర్తయి, బిల్లు మంజూరుకాని సీసీ రోడ్డు

కొంతమంది నాయకులు గ్రామాల్లో సీసీ రోడ్ల నిర్మాణం చేపట్టారు. నర్సీపట్నం నియోజవర్గం పరిధిలోని నర్సీపట్నం మండలంలో రూ.4.9 కోట్లుతో 55 రోడ్లు (4.9 కిలోమీటర్లు), నాతవరం మండలంలో రూ.12.3 కోట్లుతో 124 రోడ్లు (20.55 కిలోమీటర్లు), గొలుగొండ మండలంలో రూ.8.2 కోట్లుతో 145 రోడ్లు (13.5 కిలోమీటర్లు), మాకవరపాలెం మండలంలో రూ.12.8 కోట్లుతో 111 రోడ్లు (12.8 కిలోమీటర్లు) మంజూరు చేశారు. వీటిలో నర్సీపట్నంలో 40, నాతవరంలో 78, గొలుగొండలో 103, మాకవరపాలెంలో 62 రోడ్ల నిర్మాణ పనులు పూర్తి చేశారు. మిగిలిన రోడ్ల పనులు జరుగుతున్నాయి. పూర్తయిన పనులకు సంబంధించి పంచాయతీ రాజ్ అధికారులు ఎప్పటికప్పుడు బిల్లులను ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేస్తున్నారు. నర్సీపట్నం మండలంలో

... మిగతా 8వ పేజీలో

జీబీఎస్ కలకలం

కేజీహెచ్‌లో చికిత్స పొందుతూ వృద్ధురాలి మృతి

- ఆస్పత్రిలోని రెండు విభాగాల్లో మరో ఐదుగురు బాధితులు
- లక్షణాలు కనిపించిన వెంటనే అప్రమత్తం కావాలంటున్న వైద్యులు



విశాఖపట్నం, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): గులియన్ బారే సిండ్రోమ్ (జీబీఎస్) బారినపడి సోమవారం ఒక మహిళ మృతి చెందడంతో జిల్లా వాసులు ఆందోళన చెందుతున్నారు. ప్రస్తుతం మరో ఐదుగురు బాధితులు కేజీహెచ్‌లో చికిత్స పొందుతున్నారు. వారిలో నలుగురు జనరల్ మెడిసిన్ వార్డులో, మరొకరు న్యూరాలజీ విభాగంలో ఉన్నారు. ఐదుగురి పరిస్థితి నిలకడగా ఉన్నట్టు వైద్యులు చెబుతున్నారు. అయితే, గతంలో ఎన్నడూ లేని విధంగా జీబీఎస్ కేసులు వరుసగా నమోదవుతుండడం కలవరపరుస్తోంది.

అప్రమత్తం కావాల్సిందే..

జ్వరం, జలుబు, దగ్గు, డయేరియా వంటివి వచ్చి

... మిగతా 8వ పేజీలో

నూకాంబిక ఆలయానికి మరో రోడ్డు

మరిడిమాంబ ఆలయం నుంచి జాతీయ రహదారి వరకు నిర్మాణం

- జీవీఎంసీ అధికారులు ప్రణాళిక
- ప్రస్తుతం బండిబాటగా ఉన్న రోడ్డును 30 అడుగులకు విస్తరించాలని యోచన
- అమ్మవారి ముఖద్వారం రోడ్డులో తగ్గనున్న ట్రాఫిక్ సమస్య

అనకాపల్లి టౌన్, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): స్థానిక నూకాంబిక ఆలయానికి వచ్చే భక్తులకు రవాణా సదుపాయాన్ని మరింత మెరుగుపరచడానికి జీవీఎంసీ పట్టణ ప్రణాళికా విభాగం అధికారులు కార్యాచరణను రూపొందిస్తున్నారు. అమ్మవారి ఆలయానికి సమీపంలోని మరిడిమాంబ గుడి నుంచి జాతీయ రహదారి వరకు రోడ్డును విస్తరించడానికి చర్యలు చేపట్టారు. దీనివల్ల కశింకోట, ఎలమంచిలి, మునగపాక, అచ్యుతాపురం ప్రాంతాల నుంచి వచ్చే భక్తులకు దూరం తగ్గుతుంది. అంతేకాక హైవేపై ఫ్లైఓవర్ వంతెన ప్రారంభం నుంచి పూడిమడక జంక్షన్ వరకు జాతీయ రహదారికి ఇరువైపులా వున్న నివాసితులు, రైతులు గవరపాలెం వైపునకు రాకపోకలు సాగించడానికి దగ్గర దారి ఏర్పడుతుంది.

నూకాంబిక ఆలయం ప్రధాన మార్గం నుంచి మరిడిమాంబ ఆలయం వరకు ప్రస్తుతం సీసీ రోడ్డు అందుబాటులో ఉంది. నూకాంబిక ఆలయం నుంచి జాతీయ రహదారిపైకి చేరుకోవడానికి తోటాడ జంక్షన్ వైపు ఒక్కటే మార్గం వుండడంతో వాహనాల రద్దీ అధికంగా వుంటుంది. మంగళ, గురు, ఆదివారాల్లో ఆలయానికి భక్తులు అధిక సంఖ్యలో వస్తుంటారు. ఆదివారం సంతబయలు వద్ద సంత జరగడం వల్ల ట్రాఫిక్ సమస్య ఎక్కువగా ఉండడంతో ఆలయానికి వచ్చే భక్తులు ఇబ్బందులు పడుతున్నారు. దీంతో ఆయా రోజుల్లో ట్రాఫిక్ సమస్య మరింత జటిలం అవుతున్నది. ఈ సమస్యను నివారించడానికి ఎలమంచిలి, కశింకోట, మునగపాక ప్రాంతాల నుంచి వచ్చే భక్తులు తోటాడ జంక్షన్ వరకు రాకుండా ప్రత్యామ్నాయ రోడ్డు నిర్మించాలని జీవీఎంసీ అధికారులు నిర్ణయించారు. నూకాంబిక ఆలయానికి సమీపంలో వున్న

... మిగతా 8వ పేజీలో



మరిడిమాంబ ఆలయం నుంచి జాతీయ రహదారి వరకు విస్తరించనున్న రోడ్డు

అంగన్‌వాడీల ఆందోళన



అనకాపల్లి మండలం కొత్తూరులో ఐసీడీఎస్ కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు

సమస్యల పరిష్కారం, డిమాండ్ల సాధనకు అంగన్‌వాడీ కార్యకర్తలు సోమవారం జిల్లాలోని ఐడీసీఎస్ పరిధిలో వున్న అన్ని సీడీపీవో కార్యాలయాల ఎదుట ఆందోళనలు చేశారు. సీఐటీయూ అనుబంధ ఏపీ అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని, వేతనాలు పెంచాలని, గ్రాడ్యుటీ అమలు చేయాలని, మినీ సెంటర్లను మెయిన్ సెంటర్లుగా మార్చాలని, సమ్మె కాలపు మినిట్స్‌ను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం సీడీపీవోలకు వినతిపత్రాలు అందించారు.

ఉపమాక వెంకన్నకు పూర్వ వైభవం

ఆలయాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేయాలి

టీటీడీ చైర్మన్‌కు హోం మంత్రి అనిత విజ్ఞప్తి



ఉపమాక ఆలయం అభివృద్ధిపై టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడుతో మాట్లాడుతున్న హోం మంత్రి అనిత

నక్కపల్లి/ తిరుమల, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): నక్కపల్లి మండలంలోని ఉపమాక వేంకటేశ్వరస్వామి ఆలయ అభివృద్ధికి చర్యలు తీసుకోవాలంటూ రాష్ట్ర హోంమంత్రి వంగలపూడి అనిత, టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడుకి విజ్ఞప్తి చేశారు. సోమవారం ఉదయం ఆమె తిరుమలలో శ్రీవారిని దర్శించుకున్న అనంతరం టీటీడీ చైర్మన్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఐదు ఎకరాల విస్తీర్ణంలో ఉన్న అత్యంత ప్రాశస్త్యం కలిగిన

... మిగతా 8వ పేజీలో

విద్యార్థులకు వ్యాసరచన, చిత్రలేఖనం పోటీలు



విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహిస్తున్న దృశ్యం

నక్కపల్లి, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు ప్రభుత్వ పాఠశాలల్లో హెటిరో ఔషధ పరిశ్రమ ఆధ్వర్యంలో 6వ తరగతి నుంచి 9వ తరగతి వరకూ చదువుకుంటున్న విద్యార్థులకు రహదారి భద్రతపై సోమవారం వ్యాసరచన,చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. పలు పాఠశాలలకు చెందిన విద్యార్థినీ,విద్యార్థులుఎంతో ఉత్సాహంగా పాల్గొన్నారు. హెటిరో సేఫ్టీ విభాగం ఇన్‌చార్జి కుల్లాయి రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ పోటీలను ఎంఈవో నరేశ్ పర్యవేక్షించారు. కార్యక్రమంలో హెటిరో ప్రతినిధి శ్రీనివాస్ పాల్గొన్నారు.

టీడీపీ నాయకుల పరామర్శ



పాల్తేరులో పరామర్శిస్తున్న టీడీపీ నాయకులు

పాయకరావుపేట రూరల్, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పాల్తేరు గ్రామంలో ఇటీవల మృతి చెందిన మాకినీడి పద్దరాజు, దేవవరపు వెంకట్రావు కుటుంబ సభ్యులను సోమవారం టీడీపీ మండల అధ్యక్షుడు పెదిరెడ్డి చిట్టిబాబు, నాయకులు పరామర్శించారు. ఈ సందర్భంగా తమ ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. కార్యక్రమంలో జనసేన నాయకులు దేవవరపు రఘు, టీడీపీ నాయకులు చింతకాయల రాంబాబు, దేవవరపు రాజుబాబు, బొంది కాశీవిశ్వనాథ్, వేములపూడి అప్పారావు, తదితరులు పాల్గొన్నారు.

నేడు ఆంజనేయస్వామి ఆలయ వార్షికోత్సవం

ఎలమంచిలి, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): మునిసిపాలిటీలోని రామ్‌నగర్ టిడ్కో గృహ సముదాయంలో అభయ ఆంజనేయ స్వామి ఆలయ ప్రథమ వార్షికోత్సవ కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించేందుకు నిర్వాహకులు ఏర్పాట్లు చేశారు. ఈ కార్యక్రమంలో భాగంగా సోమవారం కాలనీలో వినాయక, సాయిబాబా విగ్రహాల ప్రతిష్ఠ కార్యక్రమాన్ని నిర్వహించారు. మంగళవారం ఉదయం నుంచి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించనున్నారు. మధ్యాహ్నం అన్న ప్రసాద వితరణ ఉంటుందని కమిటీ ప్రతినిధులు తెలిపారు.

భూముల రీ-సర్వేను పరిశీలించిన తహసీల్దార్



రీ సర్వేను పరిశీలిస్తున్న తహసీల్దార్ రమేష్‌బాబు

ఎస్.రాయవరం, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కర్రివానిపాలెంలో చేపట్టిన భూముల రీ-సర్వేను సోమవారం తహసీల్దార్ జె.రమేష్‌బాబు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన రీ-సర్వే బృందాలకు భూ కొలతల విషయంలో పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో మండల సర్వేయర్ నారాయణమూర్తి, సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

ప్రతి ఇంటి వద్ద మినీ వర్మీ కంపోస్టులు : ఎంపీడీవో



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీవో సత్యనారాయణ

ఎస్. రాయవరం, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గ్రామాల్లో ప్రతీ ఇంటి వద్ద మినీ వర్మీ కంపోస్టులు ఏర్పాటు చేసే విధంగా ప్రణాళిక సిద్ధం చేశామని ఇన్‌చార్జి ఎంపీడీవో సత్యనారాయణ తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన సమావేశంలో మినీ వర్మీ కంపోస్టు, కిచెన్ గార్డెన్‌ల ఏర్పాట్లపై మండల అధికారులు, సిబ్బందికి ఆయన అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సత్యనారాయణ మాట్లాడుతూ గ్రామాల్లో మహిళలు వారి ఇళ్ల వద్దే మినీ వర్మీ కంపోస్టును ఏర్పాటు చేసుకొని, వాటి ద్వారా సేంద్రియ పద్ధతిలో కిచెన్ గార్డెన్‌లు ఏర్పాటు చేసుకొనే విధంగా ప్రణాళికలు సిద్ధం చేశామన్నారు. మండలంలోని అన్ని గ్రామాల్లో 22 వేల మంది డ్వాక్రా మహిళలు ఉండగా అందులో ముందుగా ఏడు వేల మందిని ఎంపిక చేసి, వారి ఇళ్ల వద్ద కిచెన్ గార్డెన్‌లను ఏర్పాటు చేయిస్తామన్నారు. సమావేశంలో వెలుగు ఏపీఎం శివప్రసాద్, వ్యవసాయాధికారిణి సౌజన్య, ఎన్ఆర్ఈజీఎస్ ఏపీవో ఎరకయ్య, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ తులసి, తదితర అన్ని శాఖల సిబ్బంది పాల్గొన్నారు.

అలంకారప్రాయంగా గ్రంథాలయం

▸▸ గ్రంథాలయాధికారిని నియమించాలని వినతి



రాంబిల్లిలోని శాఖాగ్రంథాలయం

రాంబిల్లి, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి) : స్థానిక శాఖా గ్రంథాలయం అలంకారప్రాయంగా మారిందని, ప్రతి రోజు తెరిచే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలని పాఠకులు కోరుతున్నారు. ప్రస్తుతం రాంబిల్లి పాత పంచాయతీ కార్యాలయంలో గ్రంథాలయాన్ని నిర్వహిస్తున్నారు. ఈ గ్రంథాలయాన్ని రాంబిల్లి పరిసర ప్రాంతాలకు చెందిన పాఠకులు, విద్యార్థులు సద్వినియోగం చేసుకుంటున్నారు. ఇన్‌చార్జి గ్రంథాలయ అధికారిని నియమించారని, ఆయన వారంలో రెండు రోజులు వస్తున్నారని, మిగతా రోజులన్ని గ్రంథాలయం మూసి ఉంటుందని పాఠకులు వాపోతున్నారు. ప్రతి రోజు గ్రంథాలయాన్ని తెరిచే విధంగా చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు.

బాబోయ్..ఇదేం దారి !

▸▸ అధ్వానంగా జగనన్న కాలనీ రహదారి



రాళ్లు తేలిన జానకయ్యపేట-ఉపమాక రహదారి

నక్కపల్లి, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని జానకయ్యపేట గ్రామానికి సమీపంలో ఏర్పాటు చేసిన ఉపమాక జగనన్న కాలనీ రహదారి అధ్వానంగా ఉంది. ఉపమాక, జానకయ్యపేట గ్రామాలకు మధ్యస్థంగా లబ్ధిదారులకు లేఅవుట్ వేశారు. అయితే ఈ కాలనీకి ఉన్న రహదారి అధ్వానంగా తయారైనా అప్పటి నుంచి ఇప్పటి వరకూ అధికారులు కన్నెత్తి చూడలేదు. ఈ రహదారిలో 200 మీటర్లు రాళ్లు తేలియాయి. అడుగడుగునా గోతులు వున్నాయి. వర్షం వస్తే నీరు నిలిచిపోతోంది. బైక్‌లు నడిపే వారు ఏ మాత్రం ఆదమర్చినా పల్టీ కొడుతున్నారు. దీనికి కారణం కంకర రాళ్ల రోడ్డుపై తేలి వున్నాయి. పాఠశాలలకు వెళ్లే విద్యార్థులు ఈ రహదారి గుండానే రాకపోకలు సాగిస్తుంటారు. ఉపమాక జగనన్న కాలనీలో జానకయ్యపేట, శీనయ్యపాలెం, ఉపమాక, మామిడివానిపాలెం, అయ్యన్నపాలెం, నక్కపల్లి, బోదిగల్లం గ్రామాల లబ్ధిదారులకు స్థలాలు ఇచ్చారు. ఈ గ్రామాలకు చెందిన చాలామంది గృహాలు నిర్మించుకున్నారు. ఈ కాలనీలో మంచినీరు కూడా లేకపోవడంతో రెండేళ్ల నుంచి ఉపమాక ఆలయం వద్దకు వెళ్లి నీటిని తీసుకెళుతున్నారు. ఈ అధ్వాన రహదారికి ఇరువైపులా తుప్పలు పెరిగిపోయాయి. కనీసం జంగిల్ క్లియరెన్స్ కూడా చేయకపోవడం చాలా బాధాకరమని కాలనీవాసులు ఆవేదన చెందుతున్నారు. రాత్రి వేళల్లో పాముల బెడద ఎక్కువగా వుందని ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా ఈ రహదారి మరమ్మతు పనులు చేపట్టాలని కోరుతున్నారు.

పతనమైన టమాటా ధర

▸▸ పొలాల్లోనే ఆవులకు మేతగా వేసిన రైతులు



ఆవులకు టమాటాలను మేతకు వేసిన రైతు సన్నిబాబు

అచ్యుతాపురం, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): టమాటా ధర పతనమవడంతో రైతులు పంటను ఆవులకు మేతగా వేశారు. మండలంలోని పలుగ్రామాల రైతులు కూరగాయల సాగుపైనే ఆధారపడి జీవిస్తున్నారు. ముఖ్యంగా అచ్యుతాపురాన్ని ఆనుకొని ఉన్న రైతులు ఎక్కువగా కూరగాయలు పండిస్తారు. వీటిని ప్రతి సోమ, బుధ, శుక్రవారాల్లో మోసయ్యపేటలో జరిగే కూరగాయల సంతలో విక్రయిస్తుంటారు. రెండు నెలల క్రితం వరకు టమాటా ధర భారీ స్థాయిలో ఉండేది. దీంతో రైతులు భారీగానే టమాటా సాగు చేశారు. ఒకే సారి ధర పడిపోవడంతో వారు తీవ్ర నిరాశకు గురయారు. సంక్రాంతి వరకు క్రేట్ (30 కేజీలు) టమాటా ధర రూ. 300 పలికేది. ప్రస్తుతం క్రేట్ 80కి కూడా వ్యాపారులు కొనడం లేదు. పొలంలో టమాటాలు ఏరి క్రేట్‌లలో సర్ది, సంతకు మోసుకువచ్చి విక్రయిస్తే కనీసం కూలి కూడా రావడం లేదని రామన్నపాలెంకి చెందిన ధర్మిరెడ్డి సన్నిబాబు తెలిపారు. అందువల్లే పశువుల మేతకు వేసేస్తున్నామని ఆయన తెలిపారు. ఎకరా టమాటా సాగుకి రూ.80 వేలు వరకు ఖర్చయిందని, రెండెకరాల్లో పంట వేశామని, బాగా దిగుబడి వచ్చినా ధరలేకపోవడంతో తీవ్రంగా నష్టపోయానని ఆవేదన వ్యక్తం చేశారు.

సమస్యల పరిష్కారం కోరుతూ అంగన్‌వాడీల ఆందోళన



ఎలమంచిలి ఐసీడీఎస్ కార్యాలయం వద్ద ఆందోళన చేస్తున్న అంగన్‌వాడీలు



నక్కపల్లి ఐసీడీఎస్ కార్యాలయం వద్ద నినాదాలు చేస్తున్న అంగన్‌వాడీలు

ఎలమంచిలి, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సోమవారం నియోజకవర్గంలోని అంగన్‌వాడీ కార్యకర్తలు సీఐటీయూ ఆధ్వర్యంలో స్థానిక ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయం వద్ద ధర్నా చేశారు. ఈ సందర్భంగా వారు కనీస వేతనం రూ.26 వేలు చేయాలని, ప్రభుత్వ పథకాలకు అర్హులుగా చేయాలని, గ్రాట్యూటీ అమలు చేయాలని, మినీ సెంటర్లు మెయిన్ సెంటర్లుగా మార్చాలని, పెండింగ్‌లో ఉన్న 164 సూపర్‌వైజర్ల పోస్టులు వెంటనే భర్తీ చేయాలని తదితర 9 డిమాండ్లను పరిష్కరించాలని నినదించారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు దేవుడు నాయుడు, సీహెచ్. శివాజీ, సోము నాయుడు మాట్లాడుతూ అంగన్‌వాడీలు గత వైసీపీ ప్రభుత్వం హయాంలో 42 రోజులు పాటు ఆందోళన కార్యక్రమాలు చేపట్టడం జరిగిందన్నారు. ఆ సమయంలో యూనియన్ నేతలతో జరిపిన చర్చల్లో మినిట్స్ ఇవ్వడం జరిగిందని, అప్పటి మినిట్స్‌ను వెంటనే అమలు చేయాలన్నారు. ఈ సందర్భంగా 9 డిమాండ్లతో ఉన్న వినతిపత్రాన్ని కార్యాలయ సిబ్బందికి అందజేశారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకరలు పాల్గొన్నారు.

నక్కపల్లిలో..

స్థానిక ఐసీడీఎస్ సీడీపీవో కార్యాలయం వద్ద అంగన్‌వాడీ కార్యకర్తలు సోమవారం ఆందోళన చేపట్టారు. ప్రభుత్వం తమను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని, సుప్రీంకోర్టు ప్రకారం గ్రాట్యూటీ అమలుచేయాలని, పెండింగ్‌లో వున్న బిల్లులను వెంటనే చెల్లించాలంటూ నినాదాలు చేశారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ప్రతినిధి దుర్గారాణి తదితరులు పాల్గొన్నారు.

పక్క పాఠశాలలో 3,4,5 తరగతులను విలీనం చేయొద్దు

మండల విద్యా శాఖాధికారి కార్యాలయం వద్ద పెద్దూరు గ్రామస్థుల ఆందోళన



ఎంఈవో కార్యాలయం ఎదుట ఆందోళన తెలుపుతున్న పెద్దూరు గ్రామస్థులు

పాయకరావుపేట రూరల్, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పెద్దూరు ప్రాథమిక పాఠశాలలో 3,4,5 తరగతులను కుమారపురం పాఠశాలలో విలీనం చేయవద్దని సోమవారం గ్రామస్థులు ఎంఈవో కార్యాలయం వద్ద ఆందోళన తెలిపారు. అనంతరం కేఎస్.గాంధీకి వినతిపత్రం అందజేశారు. పెద్దూరు నుంచి కుమారపురం వెళ్లే దారిలో ఉన్న కాలువ వర్షాకాలంలో ఉధృతంగా ప్రవహిస్తూ బ్రిడ్జి పైనుంచి పారుతుందని, దీని వలన పిల్లలు ప్రమాదానికి గురయ్యే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. మార్గమధ్యలో నిత్యం వందల సంఖ్యలో కోతులు సంచరిస్తుంటాయన్నారు. ఇవి పిల్లలను కరిచే ప్రమాదం ఉందన్నారు. పాఠశాలను కుమారపురం పాఠశాలలో కలిపితే తమ పిల్లలను ప్రయివేటు పాఠశాలలకు పంపుతామన్నారు. అధికారులు స్పందించి పెద్దూరు పాఠశాలను కుమారపురం పాఠశాలలో కలపడం నిలిపివేయాలని కోరారు. కార్యక్రమంలో పాఠశాల తల్లిదండ్రుల కమిటీ చైర్మన్ కుప్పా గణేశ్, ఉప సర్పంచ్ పాలిక ప్రసాద్, కాకి జనార్దన్‌రెడ్డి, కుప్పా నూకరత్నం, కుప్పా వెంకటలక్ష్మి, కోశెట్టి వెంకటలక్ష్మి, రాయిడి నరసింహ, పాలిక అప్పలకొండ, రాయిడి భవాని, పాలిక లోవ పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



సమావేశంలో మాట్లాడుతున్న వరలక్ష్మి

▸▸ నిర్వాహకుల సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు వరలక్ష్మి డిమాండ్

అచ్యుతాపురం, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): మధ్యాహ్న భోజన పథకం, శానిటేషన్ కార్మికుల సమస్యలు వెంటనే పరిష్కరించాలని మధ్యాహ్న భోజన పథకం రాష్ట్ర అధ్యక్షురాలు గూనూరు వరలక్ష్మి డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక సీఐటీయూ కార్యాలయంలో కార్మికులతో జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ వీరిని కార్మికులుగా గుర్తించి ప్రభుత్వం గుర్తింపు కార్డులివ్వాలన్నారు. మెనూ ధరలు పెరుగుదలకు అనుగుణంగా బడ్జెట్ పెంచాలని, ప్రతి నెల ఐదులోగా వేతనాలు చెల్లించాలన్నారు. పని భారం పెరుగుతున్నదున ప్రతి 50 విద్యార్థులకు ఒక శానిటేషన్ వర్కర్‌ని నియమించాలన్నారు. ఉద్యోగ భద్రత కల్పించడంతోపాటు ఈపీఎఫ్, ఈఎస్ఐ వర్తింపజేయాలన్నారు. ఈ సమావేశంలో సత్యవతి, సోమునాయుడు, రాము, రమణమ్మ, అప్పలనరసమ్మ, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

సమీకృత దాణాకు ప్రత్యామ్నాయంగా అజోల్లా

▸▸ జీరో పెట్టుబడితో రైతులు తయారు చేసుకోవచ్చు

▸▸ పాల దిగుబడి, వెన్న శాతం పెరుగుతుంది..

▸▸ పశువుల్లో వ్యాధినిరోధక శక్తి పెంపు

▸▸ మండల పశువైద్యాధికారి ప్రదీప్‌కుమార్



అజోల్లా దాణా తయారీపై వివరిస్తున్న ప్రదీప్‌కుమార్

మునగపాక, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): పశు దాణా ఖర్చు భారమవుతున్న ప్రస్తుత రోజుల్లో జీరో పెట్టుబడితో సమీకృత దాణాకు ప్రత్యామ్నాయంగా అజోల్లా అందుబాటులో ఉందని స్థానిక మండల పశువైద్యాధికారి ఎల్.ప్రదీప్‌కుమార్ తెలిపారు. ఇటీవల కాలంలో పశు పెంపకం పెరిగిందని, ఇటువంటి తరుణంలో దాణా ఖర్చులు భారమవుతున్నట్లు రైతులు వాపోతున్నారన్నారు. అటువంటి వారికి అజోల్లా భరోసాగా నిలుస్తోందని చెప్పారు. అజోల్లా దాణాను ఒక్కడైనా తయారు చేసుకోవచ్చునని చెప్పారు. రైతులు ఇంటి దగ్గర కూడా తక్కువ విస్తీర్ణంలో తక్కువ నీటిశ్రమతో త్వరగా ఎక్కువ అజోల్లాను తయారు చేసుకోవచ్చునని తెలిపారు. ఇది నీటిలో పెరిగే ఒక నాచు మొక్క అని, ఇది నీలి ఆకుపచ్చ రంగు కలిగి ఉంటుందన్నారు. ఇది తిన్న పశువుల్లో పాల దిగుబడి 15 నుంచి 20 శాతం పెరుగుతుందని తెలిపారు. పాలలో వెన్న శాతం కూడా పెరుగుతుందని చెప్పారు. పాల దిగుబడి పెరుగుతుందన్నారు. ఈ దాణాను ఆవులు, గేదెలతోపాటు గొర్రెలు, మేకలు, కోళ్ల, కుందేళ్ల, పందులు, చేపలు పెంపకానికి కూడా వినియోగించవచ్చునని తెలిపారు. పోషక పదార్థాలు ఎక్కువగా ఉన్నందున పశువుల్లో రోగ నిరోధిక శక్తి పెంపునకు కూడా దోహదంగా నిలుస్తుందన్నారు. దీనిపై ఎప్పటికప్పుడు రైతులకు అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు.

ఇళ్ల పట్టాల మంజూరుకు వినతి



రెవెన్యూ అధికారికి వినతిపత్రం అందజేస్తున్న గొర్లె నానాజీ, మహిళలు

ఎలమంచిలి, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): మునిసిపాలిటీ పరిధిలోని 23వ వార్డులో గత 25 ఏళ్లగా ఉంటున్న తమకు ఇళ్ల పట్టాలు మంజూరు చేయాలని కోరుతూ సోమవారం రెవెన్యూ అధికారికి వినతిపత్రం అందజేశారు. టీడీపీ పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు గొర్లె నానాజీ, ఆడారి రమణబాబు, బొద్దపు రమణలతో కలిసి మహిళలు రెవెన్యూ అధికారిని కలిసి తమ గోడును చెప్పుకున్నారు. రైల్వే పై ఓవర్ బ్రిడ్జి పక్కన 25 ఏళ్ల నుంచి 35 కుటుంబాలు నివాసం ఉంటున్నాయని, వీరిలో 9 మందికి మాత్రమే పట్టాలు ఇచ్చారని, మిగిలిన వారిని గుర్తించి పట్టాలు ఇప్పించాలని వినతిలో కోరారు.

విద్యా సమస్యల పరిష్కారానికి ఏఐఎస్ఎఫ్ కృషి



ఏఐఎస్ఎఫ్‌లో చేరిన విద్యార్థులు

ఎలమంచిలి, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): విద్యా సమస్యల పరిష్కారంలో తాము విశేష కృషి చేస్తున్నామని అఖిల భారత విద్యార్థి సమాఖ్య(ఏఐఎస్ఎఫ్) జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు బాబ్జీ, జి. ఫణీంద్ర పేర్కొన్నారు. సోమవారం పట్టణంలోని ఎన్‌జీఓ హోమ్‌లో జరిగిన నియోజకవర్గ స్థాయి సమావేశంలో వారు మాట్లాడుతూ విద్యా పరమైన సమస్యలు ఎదురైనప్పుడు ఏఐఎస్ఎఫ్ అలుపెరుగని పోరాటం చేస్తుందన్నారు. ఈ సందర్భంగా పలువురు విద్యార్థులు ఏఐఎస్ఎఫ్‌లో చేరారు. అనంతరం నియోజకవర్గ కమిటీని ఎన్నుకున్నారు. కమిటీ కన్వీనర్‌గా మణికంఠ, కో-కన్వీనరుగా సింహాద్రి, రవి, గణేష్, కౌశిక్, శివ, కార్తీక్‌లను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రతినిధులు జగదీష్, ప్రసాద్ పాల్గొన్నారు.

రామలింగేశ్వరస్వామి ఆలయ పునః ప్రారంభ మహోత్సవాలు



ఆలయ పునః ప్రారంభ పూజలు చేస్తున్న పండితులు

ఎలమంచిలి, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): స్థానిక కొత్తపేటలో రామలింగేశ్వర స్వామి ఆలయం పునః ప్రారంభోత్సవ కార్యక్రమాలు సోమవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఐదు రోజులపాటు వేద పండితుల సమక్షంలో నిర్వహించే ఈ కార్యక్రమంలో తొలి రోజు గురువందనం, మహాగణపతి పూజ, తదితర కార్యక్రమాలను నిర్వహించారు. మునిసిపల్ చైర్‌పర్సన్ రమాకుమారితో పాటు పలువురు ప్రముఖులు, భక్తులు దేవతామూర్తులను దర్శించుకున్నారు. ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన యాగశాలలో దేవతా హోమం, రుద్రహోమం నిర్వహించారు.

భూకబ్జాకు యత్నించిన వారిపై చర్యలు తీసుకోవాలి

▸▸ తహసీల్దార్‌కు పూడిమడక మత్స్యకారుల వినతి



తహసీల్దార్‌కి వినతిపత్రాన్ని ఇస్తున్న మత్స్యకారులు

అచ్యుతాపురం, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): భూకబ్జాకు ప్రయత్నించిన వారిపై చర్యలు తీసుకోవాలంటూ పూడిమడక మత్స్యకారులు సోమవారం తహసీల్దార్ జీవీ జనార్దన్‌కు వినతిపత్రాన్నిచ్చారు. పూడిమడక సర్వే నంబరు 82లో గల 50 ఎకరాల ప్రభుత్వ భూమిలో తాము అనాదిగా సాగుచేసుకుంటున్నామని, దీనిని ఆదివారం కొందరు దౌర్జన్యంగా ట్రాక్టర్‌తో దున్నుతుండగా అడ్డుకున్నామని, ఆక్రమణకు ప్రయత్నించిన వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశరు.. వినతిపత్రం ఇచ్చిన వారిలో మత్స్యకారకుల పెద్దలు వాడమదుల సోములు, బొడ్డు జగ్గ, చింతకాయల సత్తియ్య, మేరుగు కాసుబాబు, చేపల తాతలు ఉన్నారు.

బొలిశెట్టి కుటుంబ సభ్యులను పరామర్శించిన బూడి



అప్పారావు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న బూడి ముత్యాలనాయుడు, తదితరులు

ఎస్.రాయవరం, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): మండల వైస్ ఎంపీపీ బొలిశెట్టి గోవిందరావును సోమవారం మాజీ ఉప ముఖ్యమంత్రి, వైసీపీ జిల్లా అధ్యక్షుడు బూడి ముత్యాలనాయుడు పరామర్శించారు. గోవిందరావు తండ్రి అప్పారావు ఇటీవల మృతి చెందడంతో ఆ విషయం తెలుసుకున్న ముత్యాలనాయుడు ఎస్.రాయవరంలోని గోవిందరావును పరామర్శించారు. అనంతరం అప్పారావు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో కాపు కార్పొరేషన్ రాష్ట్ర మాజీ డైరక్టర్ వీసం రామకృష్ణ, వైసీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి కొణతాల శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి అంగన్‌వాడీలకు జ్ఞానజ్యోతి శిక్షణ

కోటవురట్ల, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 18 నుంచి 25వ తేదీ వరకు అంగన్‌వాడీ కార్యకర్తలకు జ్ఞానజ్యోతి శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నామని ఎంఈవోలు రామారావు, జోషి తెలిపారు. సోమవారం ఎంఆర్‌సీ భవనంలో వారు విలేకర్లుతో మాట్లాడుతూ మంగళవారం కోటవురట్ల ప్రభుత్వ హైస్కూల్‌లో అంగన్‌వాడీ కార్యకర్తలకు ఆరు రోజుల పాటు శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నామన్నారు. శిక్షణ పొందుతున్న వారికి ఉచితంగా భోజనం సదుపాయం కల్పిస్తున్నామన్నారు.

గంజాయి రవాణా కట్టడికి మరింత నిఘా

- తాళ్లపాలెం కూడలిలో విస్తృత తనిఖీలు నిర్వహించండి
- సైబర్ నేరాలపై ప్రజలను అప్రమత్తం చేయండి
- కశింకోట పోలీసులకు ఎస్పీ తుహిన్ సిన్హా ఆదేశం


సఖి వన్‌స్టాప్ సెంటర్‌లో వివరాలు తెలుసుకుంటున్న ఎస్పీ తుహిన్‌సిన్హా

కశింకోట, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి) : గంజాయి రవాణా నియంత్రణకు తాళ్లపాలెం కూడలిలో మరింత విస్తృత తనిఖీలు నిర్వహించాలని అనకాపల్లి జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా అధికారులకు సూచించారు. సోమవారం ఆయన స్థానిక పోలీసు స్టేషన్‌ను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పెండింగ్‌లో ఉన్న కేసుల వివరాలను తెలుసుకున్నారు. సైబర్ నేరాలు వేగంగా పెరుగుతున్న నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. నేరాలపై ఎప్పటికప్పుడు అవగాహన సదస్సులు ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందని తెలిపారు. అసాంఘిక కార్యకలాపాలను నిరోధించేందుకు ప్రధాన కూడళ్లలో సీసీ టీవీ కెమేరాలను ప్రజల సహకారంతో ఏర్పాటు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సీఐ అల్లు స్వామినాయుడు, ఎస్ఐ మనోజ్‌కుమార్ పాల్గొన్నారు.

సఖి వన్ స్టాప్ సెంటర్‌ను సందర్శించిన ఎస్పీ

కొత్తూరు : అతివలకు అండగా ఉంటున్న పట్టణంలోని ఎన్టీఆర్ ఆసుపత్రి సమీపంలో గల సఖి వన్‌స్టాప్ సెంటర్‌ను ఎస్పీ తుహిన్ సిన్హా సోమవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లైంగిక వేధింపులు, గృహ హింస, బాల్యవివాహాలు, వరకట్న వేధింపులు, మహిళల అక్రమ రవాణా, సోషల్ వెబ్‌సైట్ల ద్వారా జరిపే నేరాలు, మహిళలపై వేధింపులు తదితర ఫిర్యాదులపై మహిళలు నిర్భయంగా 181కు కాల్ చేయవచ్చని తెలిపారు. ఫిర్యాదు తీవ్రత ఆధారంగా సఖీ కేంద్రంలో సైకో సోషల్ కౌన్సిలింగ్, లీగల్ కౌన్సిలింగ్ ఇవ్వడం జరుగుతుందన్నారు. అవసరమైతే పోలీసుల సహాయం కూడా తీసుకోవడం జరుగుతుందన్నారు. అతివల సమస్యల సత్వర పరిష్కారానికి, రక్షణ కల్పించేందుకు సఖివన్ స్టాప్ సెంటర్ ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. కాగా 181కు కాల్ చేసి సంప్రదిస్తే తక్షణం సఖి వన్‌స్టాప్ సెంటర్‌లో ఆశ్రయం కల్పిస్తారని తెలిపారు. 5 నుంచి 10 రోజుల వరకు ఆశ్రయం కల్పించడం జరుగుతుందన్నారు. 18 ఏళ్ళ లోపు, దాటిన వారు ఎవరైనా సంప్రదించవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో మహిళా పోలీసు స్టేషన్ సీఐ చంద్రశేఖర్, ఎస్ఐలు యమునా, ఈశ్వరరావు, అడ్మినిస్ట్రేటర్ ఎం.వి.మంజులవాణి, నోడల్ ఆఫీసర్ ఎల్.సుజాత, సూపరింటెండెంట్ పద్మకళ తదితరులు పాల్గొన్నారు.

చినబాబు కాలనీలో పారిశుధ్య పనులు


ఆర్అండ్‌బీ రోడ్డులో చెత్త తొలగింపుతో పరిశుభ్రంగా కనిపిస్తున్న దృశ్యం

తుమ్మపాల, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి) : మేజర్ పంచాయతీ తుమ్మపాల చినబాబు కాలనీలో సోమవారం పారిశుధ్య పనులను ముమ్మరంగా చేపట్టారు. ఇక్కడి పరిస్థితులపై 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన 'చీనబాబు కాలనీ' కథనానికి అధికారులు వెనువెంటనే స్పందించారు. పంచాయతీ అధికారులు హుటాహుటిన కాలనీలో ఎక్కడెక్కడ చెత్త కుప్పలు పేరుకుపోయాయో గుర్తించి తొలగించారు. అలాగే మురుగు నిల్వలను శుభ్రం చేసి కాలనీలో బ్లీచింగ్ చల్లారు.

'విశాఖ డెయిరీ ఆవు పాల సేకరణ ధర పెంచాలి'

అనకాపల్లి టౌన్, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి) : విశాఖ డెయిరీ యాజమాన్యం ఆవుపాల సేకరణ ధర పెంచాలని పాల రైతుల సంఘం అనకాపల్లి జిల్లా కమిటీ సమావేశం ఓ తీర్మానంలో కోరింది. సోమవారం ఇక్కడ ఏర్పాటైన రౌండ్ టేబుల్ సమావేశంలో పలు అంశాలపై చర్చించారు. గత నవంబరులో తగ్గించిన ఆవుపాల సేకరణ ధరను పెంచాలని, కనీస వెన్నశాతాన్ని ఎనిమిది శాతం నుంచి 3.1 శాతానికి పెంచడాన్ని వెనక్కి తీసుకోవాలని, 30 లీటర్ల కంటే తక్కువ పాలు పోసిన కేంద్రాల పాలు ఆపేయాలన్న నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని, రైతులకు వెంటనే బోనస్ చెల్లించాలని కోరారు. ఈ డిమాండ్ల సాధనకు త్వరలో 'చలో విశాఖ డెయిరీ' కార్యక్రమానికి రైతులను సమీకరించి పోరాడి యాజమాన్యంపై ఒత్తిడి తేవాలని సమావేశం తీర్మానించింది. ఈ సమావేశంలో రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎం.సూర్యనారాయణ, జిల్లా పాల రైతుల సంఘం అధ్యక్షుడు భూలోకనాయుడు, రైతు సంఘం అధ్యక్షుడు కర్రి అప్పారావు, బి.అప్పారావు, బ్రహ్మాజీ, నాయనబాబు తదితరులు పాల్గొన్నారు.

మేయర్‌పై అవిశ్వాసం?

- కూటమి ప్రజా ప్రతినిధుల భేటీలో చర్చ
- ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడుతో చర్చించిన అనంతరం తుది నిర్ణయం
- ఎమ్మెల్సీ ఎన్నికల్లో రఘువర్మకు మద్దతుపైనా చర్చ


హరి వెంకటకుమారి

విశాఖపట్నం, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): మహా విశాఖ నగర పాలక సంస్థ (జీవీఎంసీ) మేయర్ గొలగాని హరివెంకట కుమారిపై అవిశ్వాసం పెట్టాలని కూటమి ప్రజాప్రతినిధులు, నాయకులు భావిస్తున్నారు. వచ్చే నెల 18వతేదీకి మేయర్ పదవీకాలం నాలుగేళ్లు పూర్తికానున్నది. ఆ తరువాత అవిశ్వాసం ప్రవేశపెట్టాలని యోచిస్తున్నారు. మేయర్‌పై అవిశ్వాసం, ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలపై చర్చించేందుకు కూటమి పార్టీల ప్రజా ప్రతినిధులు సోమవారం రాత్రి దసపల్లా హోటల్‌లో సమావేశమయ్యారు. పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు, ఎంపీ ఎం.శ్రీభరత్, విప్ గణబాబు, ఎమ్మెల్యేలు గంటా శ్రీనివాసరావు, వెలగపూడి రామకృష్ణబాబు, పంచకర్ల రమేష్‌బాబు, వంశీకృష్ణ శ్రీనివాస్, విష్ణుకుమార్‌రాజు, ఏపీ అర్బన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్ చైర్మన్ పీలా గోవింద సత్యనారాయణ, ఎమ్మెల్సీ వేపాడ చిరంజీరావు, జీవీఎంసీ ఫ్లోర్ లీడర్ పీలా శ్రీనివాస్, తదితరులు హాజరయ్యారు. మేయర్ పదవీకాలం నాలుగేళ్లు పూర్తయిన తరువాత అవిశ్వాసం ప్రవేశపెట్టేందుకు అవకాశం ఉందని, అందుకోసం ఇప్పటి నుంచే సన్నాహాలు చేయాలని కొందరు అభిప్రాయపడ్డారు. దీనిపై సీఎం చంద్రబాబునాయుడుతో చర్చించి, అనుమతి తీసుకోవాలని మరికొందరు సూచించారు. మేయర్ పదవిని జీవీఎంసీ పార్టీ ఫ్లోర్ లీడర్ పీలా శ్రీనివాస ఆశిస్తున్నారు. ఇదే విషయమై అధినేతను పలుమార్లు కలిశారు. కాగా ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎన్నికల్లో సిట్టింగ్ ఎమ్మెల్సీ పాకలపాటి రఘువర్మకు మద్దతుపై కూడా సమావేశంలో చర్చించారు. ఈ విషయాన్ని పట్టభద్ర ఎమ్మెల్సీ చిరంజీవిరావు ప్రస్తావించారు. 2023లో జరిగిన ఉత్తరాంధ్ర పట్టభద్ర ఎమ్మెల్సీ ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థి వేపాడ చిరంజీవిరావుకు రఘువర్మ మద్దతు పలికారు. అప్పటి నుంచి టీడీపీలో పలువురు నేతలతో రఘువర్మకు సన్నిహిత సంబంధాలు ఉన్నాయి. ప్రధానంగా రఘువర్మ నామినేషన్‌కు చిరంజీవిరావు హాజరుకావడంతోపాటు ప్రచారం చేస్తున్నారు. రఘువర్మకు మద్దతు గురించి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుతో చర్చించిన తరువాతే ఒక నిర్ణయానికి రావాలని ఎమ్మెల్యేలు నిర్ణయించారు. ఈ సమావేశానికి పార్లమెంటరీ నియోజ కవర్గ పార్టీ అధ్యక్షుడు గండి బాబ్జీకి ఆహ్వానం లేదు. అయితే ఎంపీ శ్రీభరత్‌ను కలిసేందుకు దసపల్లా హోటల్‌కు వెళ్లిన బాబ్జీని పీలా గోవింద, పీలా శ్రీనివాస్‌లు సమావేశానికి తీసుకువెళ్లారు. ఆయన కొద్దిసేపు ఉండి ఎంపీతో పాటు బయటకు వచ్చేశారు.

తీడ గ్రామంలో రీ సర్వే వేగవంతం

- అధికారులకు జాయింట్ కలెక్టర్ జాహ్నవి ఆదేశం
- పౌర సరఫరాల సంస్థకు చెందిన స్టాక్ పాయింట్ తనిఖీ


పౌరసరఫరాల స్టాక్ పాయింట్ తనిఖీ


తీడ గ్రామంలో భూముల రీ సర్వే పనుల వివరాలను అడిగి తెలుసుకుంటున్న జేసీ జాహ్నవి

కశింకోట, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని తీడలో జరుగుతున్న భూముల రీ సర్వే పనులు వేగవంతం చేయాలని జిల్లా జాయింట్ కలెక్టర్ ఎం.జాహ్నవి అధికారులను ఆదేశించారు. సోమవారం ఆమె గ్రామంలో పర్యటించారు. ఈ సందర్భంగా సర్వే తీరును పరిశీలించారు. ఇందులో ఎటువంటి పొరపాట్లు జరగకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. సర్వే పనులు వేగవంతం చేసేందుకు అవసరమైతే అదనపు సిబ్బందిని కూడా నియమించాలని సూచించారు. అనంతరం పౌర సరఫరాల సంస్థకు చెందిన మండల స్టాక్ పాయింటును పరిశీలించారు. గోడౌన్‌ను, పరిసర ప్రాంతాలను ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచాలని సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమంలో పౌర సరఫరాల సంస్థ జిల్లా మేనేజర్ పి.జయంతి, సర్వే విభాగం అసిస్టెంట్ డైరెక్టర్ గోపాల్, తహసీల్దార్ ఎ.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

సమ్మె కాలపు మినిట్స్‌ను ప్రభుత్వం వెంటనే అమలు చేయాలి

- అనకాపల్లి ఐసీడీఎస్, సబ్బవరం సీడీపీవో కార్యాలయాల ఎదుట అంగన్‌వాడీలు ఆందోళన
- డిమాండ్లపై వినతులు సమర్పణ



అనకాపల్లి సీడీపీవో ప్రభావతికి, సబ్బవరంలో సీడీపీవో లలితకుమారికి వినతి పత్రాలు అందజేస్తున్న అంగన్‌వాడీలు

కొత్తూరు, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి) : సమ్మె కాలపు మినిట్స్‌ను ప్రభుత్వం వెంటనే అమలు చేయాలని, లేనిపక్షంలో పోరాటాన్ని ఉధృతం చేస్తామని ఏపీ అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ అనకాపల్లి జిల్లా ప్రధాన కార్యదర్శి మజ్జి నాగశేషు, సీఐటీయూ జిల్లా కోశాధికారి వి.వి.శ్రీనివాసరావు హెచ్చరించారు. సోమవారం స్థానిక ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయం వద్ద పెద్ద ఎత్తున ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అంగన్‌వాడీలకు వేతనాలు పెంచాలని, గ్రాట్యుటీ అమలయ్యేలా చూడాలన్నారు. మినీ సెంటర్లను మెయిన్ సెంటర్లుగా మారుస్తూ జీవో ఇవ్వాలని కోరారు. రాష్ట్రంలో పేద గర్భిణులు, బాలింతలు, చిన్న పిల్లలకు అంగన్‌వాడీ వర్కర్లు, హెల్పర్లు, మినీ వర్కర్లు అనేక సేవలు అందిస్తున్నారన్నారు. అటువంటి వారికి 2019 నుంచి వేతనాలు పెంచలేదన్నారు. వేతనాలు పెంపు, తదితర సమస్యల పరిష్కారానికి 42 రోజుల పాటు సమ్మె చేయగా, 2024 జూలైలో వేతనాలు పెంచుతామని మినిట్స్ ఇచ్చారని గుర్తు చేశారు. అయినా నేటి వరకు ఆయా సమస్యలు పరిష్కారానికి నోచుకోలేదని వాపోయారు. రాష్ట్రంలో నూతనంగా ఏర్పడిన కూటమి ప్రభుత్వ హయాంలోనైనా సమ్మె కాలపు మినిట్స్ అమలుకు వెంటనే పూనుకోవాలని కోరారు. అనంతరం సీడీపీవో ప్రభావతికి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తల ప్రతినిధులు తనూజ, కృష్ణవేణి, ఉమా నారాయణమ్మ, సీఐటీయూ నాయకుడు ఉమామహేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

సబ్బవరంలో...

సబ్బవరం : సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఇక్కడి సీడీపీవో కార్యాలయం ఎదుట సబ్బవరం, పరవాడ మండలాల అంగన్‌వాడీ వర్కర్లు, హెల్పర్లు ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు గనిశెట్టి సత్యనారాయణ మాట్లాడుతూ 2024 జూలైలో సమ్మె ముగింపు సందర్భంగా ఇచ్చిన మినిట్స్ మేరకు కనీస వేతనాలు, గ్రాట్యుటీ అమలు, మినీ సెంటర్లు మెయిన్ సెంటర్లుగా మార్పు, హెల్పర్ల ప్రమోషన్లు తదితర సమస్యలను పరిష్కరించాలని కోరారు. అనంతరం సీడీపీవో లలితకుమారికి వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సబ్బవరం ప్రాజెక్టు అంగన్‌వాడీల అధ్యక్షురాలు వీవీ రమణమ్మ, కార్యదర్శి ఎం.రమణమ్మ, బి.రమణమ్మ, సీహెచ్.దేవీ, జి.అక్కమమ్మ, రెండు మండలాల అంగన్‌వాడీలు పాల్గొన్నారు.

నేడు ప్రభుత్వ పింఛనర్ల సమావేశం

పరవాడ, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రం పరవాడలోని మరిడిమాంబ కళ్యాణ మండపంలో మంగళవారం ఉదయం పది గంటలకు ప్రభుత్వ పింఛనర్ల మండల శాఖ సమావేశాన్ని నిర్వహించనున్నట్టు సంఘం అధ్యక్ష, కార్యదర్శులు ఎ.సన్నిబాబు, వీవీఏ దీక్షితులు తెలిపారు. ఈ సమావేశానికి జిల్లా శాఖ పింఛనర్ల సంఘం అధ్యక్ష, కార్యదర్శులు, కోశాధికారి, అనకాపల్లి పశ్చిమ ఖజానా అధికారులు ముఖ్య అతిథులుగా హాజరు కానున్నారన్నారు. ప్రభుత్వ పింఛనర్లంతా విధిగా హాజరు కావాల్సిందిగా కోరారు.

20న మామిడి, జీడిమామిడి తోటల ఫలసాయం కోసం వేలం

సబ్బవరం, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి) : లింగాలతిరుగుడులో సోమలింగేశ్వరస్వామి దేవస్థానం ఆధీనంలో గల మామిడి, జీడి మామిడి తోటల ఫలసాయం కోసం ఈనెల 20వ తేదీ ఉదయం పది గంటలకు బహిరంగ వేలం పాట నిర్వహించనున్నట్టు ఆలయ కార్యనిర్వహణాధికారి బి.మురళీకృష్ణ సోమవారం తెలిపారు. బంగారమ్మపాలెం సర్వే నెంబరు 70/7, సర్వే నెంబరు 70/11 లలో 3.6 ఎకరాల విస్తీర్ణంలో గల భూమిని మూడు సంవత్సరాల కాలానికి సంబంధించి ఈ వేలం ప్రక్రియ జరపనున్నామన్నారు. ఈ ఏడాది ఏప్రిల్ ఒకటి నుంచి మార్చి31 2028 వరకూ లైసెన్స్ హక్కు కొరకు వేలం నిర్వహిస్తున్నామని వివరించారు. ఆసక్తిగల వారు రూ. ఐదు వేలను ధరావత్తుగా చెల్లించి పాటలో పాల్గొనాల్సిందిగా ఆయన కోరారు.

టొరెంట్ ఫార్మాలో ప్రమాదంపై విచారణకు వినతి

పరవాడ, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి) : ఫార్మాసిటీలోని టొరెంట్ ఫార్మా పరిశ్రమలో ఆదివారం జరిగిన ప్రమాదంపై సమగ్ర విచారణ జరిపించాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు గనిశెట్టి సత్యనారాయణ, జిల్లా కోశాధికారి వీవీ శ్రీనువాసరావు కోరారు. ఈ మేరకు సోమవారం అనకాపల్లి ఆర్డీవో కార్యాలయం పరిపాలనాధికారి సుధాకర్‌కు వినతిపత్రం అందజేశారు. సక్రమమైన మాస్కులు, భద్రతా ప్రమాణాలు పాటించకపోవడం వల్లనే కాంట్రాక్ట్ కార్మికులు రామకృష్ణ, బసవేశ్వరరావు తీవ్ర అస్వస్థతకు గురయ్యారన్నారు. అస్వస్థతకు గురైన కార్మికలిద్దరికీ మెరుగైన వైద్యసేవలు అందజేయాలన్నారు.

ఇంటర్ ప్రాక్టికల్స్‌కు 3,976 మంది హాజరు

అనకాపల్లి రూరల్, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో సోమవారం జరిగిన ఇంటర్మీడియట్ ప్రాక్టికల్స్‌కు ఉదయం, మధ్యాహ్నం కలిపి మొత్తం 3976 మంది విద్యార్థులు హాజరయ్యారని ఇంటర్మీడియట్ బోర్డు జిల్లా అధికారిణి సుజాత తెలిపారు. 101 మంది గైర్హాజరయ్యారన్నారు

నేడు 14 గ్రామాల ఆరాధ్య దేవత రామచంద్రమ్మ పండుగ

- భారీ ఏర్పాట్లు చేపట్టిన నిర్వాహకులు
- 80 వేల మంది వరకు భక్తులు విచ్చేస్తారని అంచనా


విశేష అలంకరణలో రామచంద్రమ్మ ఆలయం (ఇన్‌సెట్) అమ్మవారు


జిల్లాస్థాయి కోలాటం పోటీలు

పరవాడ, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని 14 గ్రామాల ఆరాధ్య దేవత రామచంద్రమ్మ అమ్మవారి పండుగ మంగళవారం అత్యంత వైభవోపేతంగా జరగనుంది. ఇందుకు సంబంధించి వాడచీపురుపల్లిలో నిర్వాహకులు భారీ ఏర్పాట్లు చేపట్టారు. ప్రధాన కూడళ్ల వద్ద భారీ హోర్డింగులను ఏర్పాటు చేశారు. పోలిపల్లి జంక్షన్ నుంచి అమ్మవారి ఆలయం వరకు సుమారు నాలుగు కిలోమీటర్ల మేర విద్యుత్ కాంతులు విరజిల్లుతున్నాయి. సుమారు ఎనభైవేల మంది భక్తులు వస్తారన్న అంచనా. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా బారికేడ్లను ఏర్పాటు చేశారు. ఏర్పాట్లను మాజీ ఎంపీపీ, ఉత్సవ కమిటీ చైర్మన్ మాసవరపు అప్పలనాయుడు సోమవారం పరిశీలించారు. పండుగ సందర్భంగా గ్రామంలోని పలుచోట్ల సంస్కృతిక కార్యక్రమాలను ఏర్పాటు చేశారు.

ఉత్సాహంగా జిల్లాస్థాయి కోలాటం పోటీలు

ఇదిలావుంటే, సోమవారం రాత్రి జిల్లాస్థాయి కోలాటం పోటీలను నిర్వహించారు. ఉత్సవ కమిటీ చైర్మన్ మాసవరపు అప్పలనాయుడు ప్రారంభించారు. పదహారు జట్లు పోటీలకు హాజరయ్యాయి. విజేతలకు మంగళవారం సాయంత్రం నగదు బహుమతులతో పాటు జ్ఞాపికలను అందజేయనున్నారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ కూండ్రపు శ్రీనివాసరావు, గండి ఈశ్వరరావు, కూండ్రపు బాబు తదితరులు పాల్గొన్నారు. వేడుకల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా పరవాడ డీఎస్పీ విష్ణుస్వరూప్ పర్యవేక్షణలో సీఐ మల్లికార్జునరావు భారీ బందోబస్తును ఏర్పాటు చేశారు. సాయంత్రం ఐదు గంటల నుంచి ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు. బస్సులను ప్రభుత్వ బీసీ హాస్టల్ వద్ద నిలిపేలా చర్యలు చేపట్టారు.

మూడు పంచాయతీల్లో నల్లమారమ్మ జాతర



కొత్తూరు : అనకాపల్లి మండలంలోని కొత్తూరు, పిసినికాడ, సత్యనారాయణపురం పంచాయతీల్లో నల్లమారమ్మతల్లి జాతర మంగళవారం అత్యంత వైభవంగా జరగనుంది. ఇందుకు సంబంధించి నిర్వాహకులు భారీ ఏర్పాట్లు చేపట్టారు. వేకువజాము నుంచి పూజలు ప్రారంభం కానున్నాయి. రాత్రికి రామాపురం, బీఆర్‌టీ కాలనీ, రామభద్రపురం, కృష్ణాపురం, డీబీ కాలనీ, సుబ్రహ్మణ్యం కాలనీ, వుడా కాలనీలలో సాంస్కృతిక కార్యక్రమాలు జరగనున్నాయి. ఇదిలావుంటే, జాతర సందర్భంగా ఆయా గ్రామాల మహిళలు వివిధ రకాల పిండి వంటలను ఊరేగింపుగా ఆలయానికి తీసుకు వచ్చి అమ్మవారికి సారెగా సోమవారం సమర్పించారు.


మామిడిపాలెంలో దుర్గాదేవిని దర్శించుకుంటున్న భక్తులు

ఘనంగా దుర్గాదేవి ఆలయ వార్షికోత్సవం

తుమ్మపాల : అనకాపల్లి మండలం మామిడిపాలెంలో సోమవారం దుర్గాదేవి ఆలయ వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వేకువజాము నుంచి విశేష పూజలు ప్రారంభమయ్యాయి. పెద్ద సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. సారె సమర్పణ కోలాహలంగా సాగింది. మహిళలు తమ ఇళ్లలో తయారు చేసిన వివిధ రకాల పిండి వంటలను ఊరేగింపుగా ఆలయానికి తీసుకు వచ్చి అమ్మవారికి నైవేద్యంగా సమర్పించారు. సాయంత్రం ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటయ్యాయి. మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ, జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి బీమరశెట్టి రాంకీ తదితరులు పూజలు నిర్వహించారు.

సబ్బవరంలో దుర్గమాంబ తీర్థానికి ఏర్పాట్లు



సబ్బవరం : మండల కేంద్రం సబ్బవరంలో దుర్గమాంబ తీర్థం మంగళవారం జరగనుంది. ఇందుకు సంబంధించి నిర్వాహకులు భారీ ఏర్పాట్లు చేపట్టారు. వేకువజాము నుంచి విశేష పూజలు ప్రారంభం కానున్నాయి. సాయంత్రం ఆధ్యాత్మిక సాంస్కృతిక కార్యక్రమాలను ఏర్పాటు చేశారు.

అనకాపల్లిలో సందడి చేసిన బుల్లితెర హాస్యనటులు

- జబర్దస్త్ ఫేమ్ సత్తిపండు కుమారుడి వివాహానికి హాజరు
- స్కిట్‌లను చూసి కడుపుబ్బా నవ్విన అతిథులు


నూతన వధూవరులతో సత్తిపండు, చమ్మక్‌చంద్ర తదితర కళాకారులు

అనకాపల్లి టౌన్, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలో ఆదివారం రాత్రి బుల్లితెర హాస్యనటులు సందడి చేశారు. జబర్దస్త్ ఫేమ్ పీలా నాగవెంకట సత్యనారాయణ (సత్తిపండు), నాగమాంబ దంపతుల కుమారుడు కార్తీక్, భావన వివాహ వేడుక స్థానిక పూల్‌బాగ్ జంక్షన్ వద్ద గల ప్రైవేటు ఫంక్షన్ హాల్‌లో ఘనంగా జరిగింది. ఈ వేడుకకు హైదరాబాద్ నుంచి కళాకారులు విచ్చేసి నూతన వధూవరులను ఆశీర్వదించారు. ఈ సందర్భంగా నవ్వులు పండించారు. పలు రకాల స్కిట్‌లను అద్భుతంగా ప్రదర్శించి అందరినీ మెప్పించారు. ఈ కార్యక్రమంలో హాస్యనటులు చమ్మక్‌చంద్ర, అదిరే అభి, రాపేటి అప్పారావు, రాజ్‌మౌళి, గెడ్డం నవీన్, శాంతికుమార్, మహిధర్, ప్రకాశ్, గుండు మురళీ, బలగంఫేమ్ కార్థానందం, అర్జున్ తదితరులు పాల్గొన్నారు.

నిరుద్యోగ యువతకు శిక్షణ, ఉపాధి

పాడేరురూరల్, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఇన్ మారిటైం, షిప్ బిల్డింగ్ (సీఈఎంఎస్), విశాఖ పోర్టు అథారిటీ(వీపీఏ) సహకారంతో 27 సంవత్సరాలలోపు వయస్సు కలిగి 10వ తరగతి, ఇంటర్, ఏదైనా డిగ్రీ, ఐటీఐ వెల్డర్, ఫిట్టర్ విభాగాల్లో ఉత్తీర్ణులైన యువతీ, యువకులకు ఇన్వెంటరీ కంట్రోలర్, వెల్డర్ కోర్సులలో రెండు నెలల శిక్షణ ఇచ్చి, ఉపాధి అవకాశాలు కల్పిస్తామని సంస్థ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ కె.సేతుమాధవన్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. అ సక్తి గల అల్లూరి జిల్లా అభ్యర్థులు ఈనెల 20వ తేదీన పాడేరు పోలీసు స్టేషన్ గ్రౌండ్‌లో జరిగే శిబిరానికి ఉదయం 9 గంటలకు విద్యార్హత ధ్రువపత్రాలు, ఆధార్, కుల ధ్రువీకరణ పత్రం, రేషన్ కార్డు జెరాక్స్ కాపీలతో హాజరుకావాలన్నారు. మరిన్ని వివరాలకు8688411100, 8331901237, 0891-2704010 ఫోన్‌నంబర్లకు సంప్రదించాలన్నారు.

ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి గాదె ప్రచారం



ప్రచారం చేస్తున్న గాదె శ్రీనివాసుల నాయుడు

డుంబ్రిగుడ, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ప్రభుత్వ ఉన్నత, ఆశ్రమ, కేజీబీవీల్లో ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి గాదె శ్రీనివాసులునాయుడు సోమవారం ప్రచారం నిర్వహించారు. జీపీఎస్ కొనసాగింపుకు కృషి చేస్తామని, సాధారణ సెలవులు అమలయ్యేలా చూస్తామని, ఆపరేటర్ల నియమకాలకు చర్యలు చేపడతామని ఈ సందర్భంగా ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో పీఆర్‌టీయూ ప్రతినిధులు గిరి, అప్పలరాజు, గోపినాథ్, గెన్ను, లక్ష్మయ్య, రాంప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

'జర్నలిస్టుపై దాడి అన్యాయం'

డుంబ్రిగుడ, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): పార్వతీపురం మన్యం జిల్లాలోని మక్కువ మండలంలో ఓ విలేకరిపై దాడి చేయడం అన్యాయమని ఏపీయూడబ్ల్యూజే మండల ప్రతినిధులు ఎం.ఈసుబాబు, ఎం.స్వామి సోమవారం ఆవేదన వ్యక్తంచేశారు. సమాజంలో వాస్తవాలను బయపెట్టే జర్నలిస్టులపై దాడు చేయడం సరికాదని తీవ్రంగా ఖండించారు. దాడి చేసిన వారిపై తక్షణమే తగిన చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సంఘ నాయకులు ఎస్.కోటేశ్వరావు, గోపాల్, పాత్రికేయులు పాల్గొన్నారు.

నిబంధనలు పాటించకపోతే చర్యలు



వాహన చోదకులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న ఎస్‌ఐ సురేశ్

హుకుంపేట, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): వాహన చోదకులు ట్రాఫిక్ నిబంధనలు పాటించకపోతే చర్యలు తప్పవని ఎస్‌ఐ సురేశ్ హెచ్చరించారు. మండలంలోని మఠం కొత్తూరు జంక్షన్ వద్ద పాడేరు-పెదబయలు రోడ్డులో సోమవారం వాహనలు తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా అక్కడ వాహన చోదకులతో సమావేశం నిర్వహించారు. ట్రాఫిక్ నిబంధనలకు కట్టుబడి ఉంటామని వారితో ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వాహనాలను బాధ్యతాయుతంగా నడుపుతూ రోడ్డు ప్రమాదాలు జరగకుండా చూసుకోవాలని సూచించారు. ద్విచక్ర వాహన చోదకులు కచ్చితంగా హెల్మెట్ ధరించాలని, రికార్డులు కలిగి ఉంచాలని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

గిరిజనులు బ్యాంక్‌లో పొదుపు చేసుకోవాలి

సీలేరు, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): గిరిజనులు బ్యాంక్‌లో పొదుపు చేసుకుని లాభాలు పొందాలని యూబీఐ కళాజాతర బృందం పిలుపునిచ్చింది. సోమవారం ధారకొండలో యూబీఐ కళాజాతర బృందం నగదు పొదుపు, బ్యాంక్ ఖాతాల ప్రాముఖ్యతపై ప్రదర్శన ఇచ్చింది. ఈసందర్భంగా ప్రతి వ్యక్తి బ్యాంక్ ఖాతా కలిగి ఉండాలని, చిన్నమొత్తాల నగదును బ్యాంక్‌లో పొదుపు చేసుకోవడం వల్ల అవసరాలకు ఉపయోగపడుతుందన్నారు. బ్యాంక్‌లో నగదు పొదుపు చేసుకున్న వ్యక్తులకు రుణాలు ఇవ్వడం జరుగుతుందన్నారు. ప్రజలు సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలన్నారు. ఫోన్‌లో వచ్చే లింక్స్‌ను ఓపెన్ చేయరాదని, ఓటీపీలను ఎవరితోనూ పంచుకోరాదన్నారు. యాప్‌ల ద్వారా రుణాలు తీసుకొని ఆర్థిక ఇబ్బందులు పడరాదన్నారు. కార్యక్రమంలో బ్యాంక్ మిత్రాలు జోరంగి దేవేంద్ర, వీవోఏ పూజారి సోమరాజు పాల్గొన్నారు.

పెసా చట్టంపై అవగాహన తప్పనిసరి

పెదబయలు, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): పెసా చట్టంపై సభ్యులకు అవగాహన తప్పనిసరిగా ఉండాలని ఎంపీడీవో పూర్ణయ్య స్పష్టం చేశారు. మండలంలో ఇటీవల ఎన్నికైన పెసా కమిటీల అధ్యక్షులు, కార్యదర్శులు, ప్రజాప్రతినిధులకు సోమవారం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చట్టంపై అవగాహన కల్పించుకుని అభివృద్ధికి కృషి చేయాలని సూచించారు. ఈ శిక్షణకు రాష్ట్ర స్థాయి నుంచి పరిశీలకులుగా ప్రసాద్ హాజరై పలు సూచనలు అందించారు. కార్యక్రమంలో ఈవోపీఆర్డీ నరసింగరావు, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

మినీ రైల్వే స్టేషన్ ఏర్పాటుకు ప్రతిపాదనలు

▸▸ అరకు ఎంపీ డాక్టర్ తనూజరాణి



ఎంపీ తనూజరాణికి సమస్యలు తెలుపుతున్న ఆటో యూనియన్ కార్మికులు

అరకులోయ, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): అరకులోయ రైల్వే రిక్వెస్ట్ స్టేజీని మినీ స్టేషన్‌గా ఏర్పాటు కోసం ప్రతిపాదనలు పంపామని ఎంపీ డాక్టర్ గుమ్మ తనూజరాణి తెలిపారు. సోమవారం 'ఆంధ్రజ్యోతి'తో ఫోన్‌లో ఆమె మాట్లాడారు. రిక్వెస్ట్ స్టేజీ వద్ద ప్లాట్‌ఫారం లేకపోవడంతో రైలు నుంచి దిగేందుకు వృద్ధులు, మహిళలు, పిల్లలు ఇబ్బందులు పడుతున్నారని, అందువల్ల ఇక్కడ కనీస సౌకర్యాలు కల్పించాల్సిన అవసరం ఉందని చెప్పారు. ఈ సమస్యలను రైల్వే బడ్జెట్ సమావేశాల్లో నేరుగా రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్‌ను కలిసి వివరించామన్నారు. అలాగే మినీ రైల్వే స్టేషన్, రైళ్ల నిలిపివేతపై మంత్రిని కోరగా సానుకూలంగా స్పందించారన్నారు. కాగా, స్టార్ అన్నపూర్ణ ఆటో యూనియన్ కార్మికులు చిన్న, రమేశ్, అఖిల్, రాజు, నగేశ్, శంకర్, యల్లారావు తదితరులు ఎంపీ తనూజరాణిని కలిసి సమస్యలు వివరించారు.

పెన్నులు, మిఠాయిల పంపిణీ

ముంచంగిపుట్టు, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ప్రభుత్వ గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలికల, బాలుర పాఠశాల-1, 2లలో సోమవారం సీఆర్‌పీఎఫ్ 198 బెటాలియన్ అసిస్టెంట్ కమాండెంట్ రంజిత్‌కుమార్ బల్‌గోత్ర పెన్నులు, మిఠాయిలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకోవాలని, ఉన్నత శిఖరాల అధిరోహణకు విద్య ఎంతో కీలకమన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, సీఆర్‌పీఎఫ్ పోలీసులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్య ఉత్పన్నం కాకూడదు

▸▸ ప్రజలకు అందుబాటులో ఉంటూ సేవలు అందించాలి ▸▸ అరకు ఎంపీ గుమ్మ తనూజరాణి



మండల సమావేశంలోని మాట్లాడుతున్న ఎంపీ తనూజరాణి

అనంతగిరి, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): వేసవిలో తాగునీటి సమస్యపై మహిళలు రోడ్డు ఎక్కకూడదని అరకు ఎంపీ గుమ్మ తనూజరాణి స్పష్టం చేశారు. మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ శెట్టి నీలవేణి అధ్యక్షతన సోమవారం సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గిరిజన ప్రాంతంలో ప్రజలకు సేవ చేయడం మహా భాగ్యంగా అధికారులు భావించాలన్నారు. ప్రజలకు మంచిచేస్తే ఎప్పుడూ గుర్తుండిపోతామని, వైద్యాధికారిగా ఏజెన్సీలో తాను అనేక సేవలు అందించానని చెప్పారు. జలజీవన్ మిషన్ పనులు పూర్తిచేసి వేసవిలో తాగునీటి సమస్య తలెత్తకుండా చూడాలన్నారు. అనంతగిరి నుంచి ఎస్.కోట మీదుగా విశాఖ కేజీహెచ్‌కు కేసులను 108లో తరలించేలా ఉన్నతాధికారులతో చర్చిస్తానని హామీ ఇచ్చారు. పాడేరు ఏజెన్సీలోని అన్ని మండలాలకు ఒకటి చొప్పున 11 అంబులెన్స్‌లను ఎంపీ నిధులతో సమకూర్చినట్టు తెలిపారు. పీవీటీజీల ఇళ్ల నిర్మాణానికి ఇసుక సమస్యగా మారిందని, మైదాన ప్రాంతాలకు ఇసుక తరలిస్తే కేసులు నమోదు చేయాలని అధికారులకు సూచించారు. ఎంపీడీవో ఏవీవీ.కుమార్ మాట్లాడుతూ మండలంలోని శాఖల వారీగా పురోగతిపై అధికారులు సమాచారం ఇవ్వటం లేదని, ఉన్నతాధికారులు సమాచారం అడిగితే ఏం చెప్పాలని అసహనం వ్యక్తం చేశారు. బర్డ్‌ఫ్లూపై పశువైద్యాధికారి సాగిరి గణేశ్వరరావు అవగాహన కల్పించారు. సమావేశంలో తహసీల్దార్ మాణిక్యం, జడ్పీటీసీ సభ్యుడు గంగరాజు, కోఆప్షన్ సభ్యుడు మదీనా, సభ్యులు పాల్గొన్నారు.

చిట్టంపాడు, గుజ్జలి హైడ్రో పవర్ ప్రాజెక్టును రద్దు చేయాలి

▸▸ గిరిజన సంఘం జాతీయ కార్యదర్శివర్గ సభ్యుడు అప్పలనర్స



విలేకరులతో మాట్లాడుతున్న అప్పలనర్స, తదితరులు

చింతపల్లి, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): కేబినెట్ ఆమోదించిన చిట్టంపాడు, గుజ్జలి హైడ్రో పవర్ ప్రాజెక్టును రద్దు చేయాలని గిరిజన సంఘం జాతీయ కార్యదర్శివర్గ సభ్యుడు పి. అప్పలనర్స డిమాండ్ చేశారు. సోమవారం మండల కేంద్రంలో గిరిజన సంఘం నాయకులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ మూడేళ్ల క్రితం యర్రవరం హైడ్రో పవర్ ప్రాజెక్టును షిర్డీసాయి ఎలక్ట్రికల్ కంపెనీకి గ్రీన్ ఎనర్జీ పేరిట కట్టబెట్టిందన్నారు. దీనికి వ్యతిరేకంగా గిరిజన సంఘం, వామపక్షాలు చేపట్టిన ఆందోళనలకు టీడీపీ, జనసేన, బీజేపీ మద్దతిచ్చాయన్నారు. తాజాగా ఈనెల 6వ తేదీన జరిగిన కూటమి ప్రభుత్వ కేబినెట్ సమావేశంలో అనంతగిరి మండలం చిట్టంపాడు, గుజ్జలి పవర్ ప్రాజెక్టును అజూడ ఎలక్ట్రికల్ కంపెనీకి అప్పగిస్తూ తీర్మానం చేసిందన్నారు. దీన్ని గిరిజన సంఘం, ప్రాంతీయ ఆదివాసీలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారన్నారు. పేసా గ్రామసభ తీర్మానం లేకుండా భూబదలాయింపు చట్టానికి వ్యతిరేకంగా ప్రైవేటు కంపెనీకి అప్పగించడం అన్యాయమన్నారు. తక్షణమే ప్రభుత్వం కేబినెట్ ఆమోదాన్ని రద్దు చేయాలన్నారు. ఎన్నికల ముందు గిరిజన ప్రజలకు ఇచ్చిన జీవో నంబరు-3 అమలులోకి తీసుకొచ్చేందుకు కృషి చేస్తున్నట్టు ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రకటించడాన్ని స్వాగతిస్తున్నామన్నారు. ఆదివాసీలకు శతశాతం ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు జీవో నంబరు-3ను ఈనెల 24నుంచి జరుగుతున్న అసెంబ్లీ సమావేశాల్లోనే ఆమోదించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో గిరిజన సంఘం జిల్లా గౌరవాధ్యక్షుడు బోనంగి చిన్నయ్య పడాల్, జిల్లా ఉపాధ్యక్షులు పాంగి ధనుంజయ్, సూరిబాబు, ఎంపీటీసీ సభ్యుడు అంపురంగి బుజ్జిబాబు పాల్గొన్నారు.

నేటి నుంచి 27 వరకు ఆధార్ ప్రత్యేక క్యాంపులు : ఎంపీడీవో



ఎంపీడీవో ఎస్.డేవిడ్‌రాజు

పాడేరురూరల్, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): గ్రామ, వార్డు సచివాలయాల ఆధ్వర్యంలో మండలంలో ఈనెల 18వ తేదీ నుంచి 27వ తేదీ వరకు ప్రత్యేక ఆధార్ క్యాంపులను నిర్వహిస్తున్నామని, వీటిని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవో ఎస్.డేవిడ్‌రాజు కోరారు. ఆధార్ అప్‌డేట్, న్యూ ఎన్‌రోల్‌మెంట్, డాక్‌మెంట్ అప్‌డేట్స్, బయోమెట్రిక్ అప్‌డేట్స్ తదితర సేవలను ఈ క్యాంప్‌లో నిర్వహించనున్నారన్నారు. ఈ నెల 18, 21వ తేదీలలో చింతలవీధి, గొండెలి, వంట్లమామిడి, మినుములూరు గ్రామ సచివాలయాల్లో, 24, 25, 27, 28వ తేదీలలో చింతలవీధి, డోకులూరు, వంతాడపల్లి, లగిశపల్లి గ్రామ సచివాలయాల్లో ఆధార్ క్యాంప్‌లను నిర్వహిస్తున్నామన్నారు. ఆరు గ్రామ సచివాలయాల పరిధిలో ఆధార్ సీడింగ్‌లు చేసేందుకు చింతలవీధి డీఏ డి.మహిష్మ, పాడేరు-3 డీఏ ఎస్.సదానంద్, వంట్లమామిడి డీఏ వి.వాసుకిరణ్, మినుములూరు డీఏ బి.సూర్యనారాయణను నియమించారన్నారు. ఈ అవకాశాన్ని ఆధార్ సమస్యలు ఉన్న ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. గిరిజన సంక్షేమ, మహిళా శిశు సంక్షేమ శాఖలకు ప్రాధాన్యత ఇచ్చి ఆధార్ కార్డు లేని వారికి నమోదు చేయించడానికి అంగన్‌వాడీ సిబ్బంది ప్రత్యేక శ్రద్ధ వహించాలని కోరారు. 0 నుంచి 6 ఏళ్ల లోపు పిల్లలకు తప్పనిసరిగా ఆధార్ కార్డు కోసం నమోదు చేయించాలన్నారు. ఆధార్ కార్డు లేని పిల్లల జాబితాను మహిళా శిశు సంక్షేమశాఖ ద్వారా అంగన్‌వాడీ కార్యకర్తలకు అందజేస్తామన్నారు.

వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి : డీఈవో



పాఠశాలలో రికార్డులు తనిఖీ చేస్తున్న డీఈవో బ్రహ్మాజీరావు

ముంచంగిపుట్టు, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): చదువులో వెనకబడిన విద్యార్థులపై ఉపాధ్యాయులు ప్రత్యేక దృష్టిసారించాలని జిల్లా విద్యా శాఖాధికారి పి.బ్రహ్మాజీరావు ఆదేశించారు. మండలంలోని కిలగాడ పంచాయతీ కేంద్రంలో ప్రభుత్వ ఉన్నత పాఠశాలను సోమవారం సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాల రికార్డులను పరిశీలించారు. తరగతి గదులకు వెళ్లి విద్యార్థులతో మాట్లాడి పలు ప్రశ్నలు వేసి జవాబులు రాబట్టారు. ఉపాధ్యాయులు విద్యార్థులకు అనుగుణంగా బోధన నైపుణ్యాలను మెరుగుపర్చుకోవాలని, అప్పుడే ఉత్తమ ఫలాతాలు సాధించేందుకు అవకాశం ఉంటుందని డీఈవో స్పష్టంచేశారు. అనంతరం మండల కేంద్రంలోని శారదానికేత్ ఇంగ్లీష్ మీడియం ప్రైవేటు స్కూల్‌ను సందర్శించి రికార్డులు పరిశీలించారు. తరగతి గదులు, మరుగుదొడ్లను, సౌకర్యాలను పరిశీలించారు. విద్యార్థులకు మెరుగైన విద్యను అందించాలని, అవసరమైన సౌకర్యాలను కల్పించాలని సూచించారు. ఫీజులు, ఉపాధ్యాయుల వివరాలను ప్రిన్సిపాల్ మత్స్యరాజుతో మాట్లాడి తెలుసుకున్నారు.

'గ్రామాల అభివృద్ధికి సమన్వయంతో పనిచేయండి'



శిక్షణ శిబిరంలో మాట్లాడుతున్న ఎంపీడీవో లవరాజు

అరకులోయ, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): గ్రామాల అభివృద్ధి కోసం ఉద్యోగులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేయాలని ఎంపీడీవో లవరాజు సూచించారు. మండల పరిషత్ కార్యాలయంలో పెసా ప్రతినిధులు, ప్రజాప్రతినిధులు, సచివాలయ ఉద్యోగులకు సోమవారం శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ పంచాయతీల పరిధిలోని అవసరాలను గుర్తించాలని చెప్పారు. గ్రామాల్లో మౌలిక సదుపాయాలను ప్రాధాన్యక్రమంలో కల్పించాలన్నారు. అన్ని గ్రామాల ప్రజలకు అభివృద్ధి ఫలాలు అందేలా ప్రజాప్రతినిధులు, పెసా సభ్యులు, సచివాలయ ఉద్యోగులు కృషి చేయాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో బొండాం సర్పంచ్ దురియా బాస్కరరావు, న్యాయవాది సుంకరి ఆనంద్, బొండాం క్లస్టర్ పరిధిలోని పెసా కమిటీల ప్రతినిధులు, గ్రామ సచివాలయాల ఉద్యోగులు పాల్గొన్నారు.

'పీడీఎఫ్ అభ్యర్థి విజయగౌరిని గెలిపించాలి'



విలేకర్లతో మాట్లాడుతున్న గిరిజన సంఘం నేతలు

అరకులోయ, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పీడీఎఫ్ అభ్యర్థి కె.విజయగౌరిని గెలిపించాలని గోదావరి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఐ.వెంకటేశ్వరరావు, గిరిజన సంఘం జిల్లా నేత పొద్దు బాలదేవ్ పిలుపునిచ్చారు. సోమవారం స్థానిక విలేకరులతో వారు మాట్లాడుతూ విజయగౌరిని మొదటి ప్రాధాన్య ఓటువేసి గెలిపించాలని ఉపాధ్యాయుల ఓటర్లకు విన్నవించారు. ఈ సందర్భంగా పాడేరు ఐటీడీఏ పరిధిలోని పలు విద్యాలయాలకు వెళ్లి విజయగౌరికి మద్దతుగా వారు ప్రచారం చేశారు.

పెదబయలులో ప్రచారం..

పెదబయలు: ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పీడీఎఫ్ అభ్యర్థి విజయగౌరికి మద్దతుగా ఆదివాసీ గిరిజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కిల్లో సురేంద్ర ఆధ్వర్యంలో సోమవారం ప్రచారం నిర్వహించారు. మండల కేంద్రంలోని పలు పాఠశాలల్లో ఉపాధ్యాయులను కలిసి విజయగౌరిని గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆదివాసీ గిరిజన సంఘం నాయకులు సన్నిబాబు, దేవరాజు, గంగాధరం పాల్గొన్నారు.

భూ పట్టాల సాంకేతిక సమస్యను పరిష్కరించండి

▸▸ అగ్రహారం గిరిజనుల వినతి



పట్టాలను చూపిస్తూ విలేకరులతో మాట్లాడుతున్న అగ్రహారం గిరిజనులు

గూడెంకొత్తవీధి, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి):భూమి పట్టాల జారీలో నెలకొన్న సాంకేతిక సమస్యను పరిష్కరించి, ప్రభుత్వ పథకాలను అందించాలని అగ్రహారం గిరిజనులు కోరారు. సోమవారం వారు స్థానిక విలేకరులతో మాట్లాడుతూ గ్రామానికి చెందిన 80మంది గిరిజనులకు ప్రభుత్వం భూ పట్టాలు గతంలో జారీ చేసిందన్నారు. అయితే ఈ పట్టాల్లో ధారకొండ పంచాయతీ పరిధిలో గ్రామంగా రిజిస్టర్ అయి ఉన్నాయన్నారు. తమ గ్రామం రెవెన్యూ గ్రామమైనప్పటికి రెవెన్యూ అధికారులు పరిగణనలోకి తీసుకోవడం లేదన్నారు. ధారకొండ పంచాయతీ పరిధిలో పట్టాలు నమోదు కావడంతో ఈ-క్రాప్, రాయితీ విత్తనాలు, ఇతర ప్రభుత్వ పథకాలు పొందేందుకు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నామన్నారు.ఇప్పటికైన ఉన్నతాధికారులు స్పందించి భూ పట్టాల్లో కలిగిన సాంకేతిక సమస్యను పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు.

పెసా గ్రామసభకు ప్రత్యేక అధికారాలు

▸▸ రాష్ట్ర పరిశీలకుడు నాగరాజు



సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర పరిశీలకుడు నాగరాజు

చింతపల్లి, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): పెసా గ్రామసభకు ప్రత్యేక అధికారాలు ఉంటాయని రాష్ట్ర పరిశీలకుడు కె.నాగరాజు అన్నారు. సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో డ్వాక్రా మహిళలు, వార్డు సభ్యులకు జరుగుతున్న పెసా చట్టం శిక్షణ తరగుతలను ఆయన తనిఖీ చేశారు. ఈసందర్భంగా రాష్ట్ర పరిశీలకుడు మాట్లాడుతూ పెసా చట్టం 1996లో అమలులోకి వచ్చిందన్నారు. గిరిజనుల సాధికారత కోసం ఏర్పాటు చేయబడిన కీలకమైన చట్టం అన్నారు. ఐదో షెడ్యూల్ ప్రాంతాల్లో ఈ చట్టం వర్తింపజేస్తుందన్నారు. గిరిజన ప్రాంతాల్లో గ్రామసభ పాలనను అమలు చేయడంతోపాటు గిరిజన అభివృద్ధి కోసం ఈచట్టం తీసుకు రావడం జరిగిందన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో యూఎస్‌వీ శ్రీనివాసరావు, ఏపీఎం శ్రీనివాసరావు పాల్గొన్నారు.

మూడు ఎకరాల జీడిమామిడి తోట దగ్ధం

కొయ్యూరు, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): మండలంలోని రావణాపల్లి పంచాయతీ తోటలూరుకు చెందిన అంబటి మేరీరత్నంకు చెందిన మూడు ఎకరాలలో జీడి మామిడి తోట దగ్ధమై సుమారు రూ.లక్ష మేర ఆస్తి నష్టం వాటిల్లింది. గుర్తు తెలియని వ్యక్తులు వంటచెరకుకు వెళ్లి కాల్చిన బీడి నిర్లక్ష్యంగా పడేయటంతో గాలికి రాజుకుని ప్రమాదం వాటిల్లిందని బాధితురాలు తెలిపింది. దీనిపై విచారణ జరిపి న్యాయం చేయాలని బాధితురాలు కోరింది.

మండల పరిషత్ ఏవోగా పాండురాజు



చింతపల్లి, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): మండల పరిషత్ అడ్మినిస్ట్రేటివ్ అధికారి(ఏవో)గా ఎం. పాండురాజు నియమితులయ్యారు. నెల రోజులు క్రితం ఏవోగా పనిచేస్తున్న రవీంద్ర పదవీ విరమణ చేయడంతో పోస్టు ఖాళీ అయ్యింది. తాజాగా అరకులోయలో సీనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్న పాండురాజుని పదోన్నతి కల్పించి చింతపల్లి ఏవోగా నియమించారు. సోమవారం ఆయన బాధ్యతలు స్వీకరించారు.

'క్షయ వ్యాధిపై అవగాహన ఉండాలి'



ఏఎన్‌ఎం శిక్షణ విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న జిల్లా టీబీ వైద్యాధికారిణి సూర్యనారాయణమ్మ

పాడేరురూరల్, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): ఏఎన్‌ఎం శిక్షణ పొందుతున్న ప్రతి విద్యార్థి క్షయ వ్యాధిపై అవగాహన కలిగి ఉండాలని జిల్లా టీబీ వైద్యాధికారిణి బి.సూర్యనారాయణమ్మ సూచించారు. జిల్లా కేంద్రంలోని ఏఎన్‌ఎం శిక్షణ కేంద్రంలో సోమవారం నిర్వహించిన యాంటీ టీబీ వీక్ కార్యక్రమంలో భాగంగా క్షయ వ్యాధిపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ క్షయ వ్యాధి లక్షణాలను వివరించారు. విద్యార్థులు స్వగ్రామాలకు వెళ్లేటప్పుడు ఆ సమయంలో వ్యాధి లక్షణాలు ఉన్నవారిని వెంటనే వైద్యుల వద్దకు వెళ్లి వైద్య సేవలు పొందేలా చూడాలని తెలిపారు. కార్యక్రమంలో ఏఎన్‌ఎం శిక్షణ స్కూల్ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రాథమిక పాఠశాలలను కుదిస్తే సహించం

▸▸ గిరిజన సంఘం నాయకులు, ప్రజాప్రతినిధులు



ఎంపీడీవోకు వినతిపత్రం అందిస్తున్న ప్రజాప్రతినిధులు, నాయకులు

పెదబయలు, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): ప్రాథమిక పాఠశాలలను కుదిస్తే సహించేది లేదని ప్రజాప్రతినిధులు, గిరిజన సంఘం నాయకులు హెచ్చరించారు. ఈ మేరకు సోమవారం మండల పరిషత్ కార్యలయం ఎదుట నిరసన తెలిపారు. అనంతరం ఎంపీడీవో పూర్ణయ్యకు వినతిపత్రాన్ని అందించారు. అనంతరం వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన జీవో-177ను తక్షణమే రద్దు చేసి ప్రాథమిక పాఠశాలలను యథాతథంగా కొనసాగించాలని డిమాండ్ చేశారు. రేషనలైజేషన్ అమలు చేస్తే పెదబయలు మండలంలో 32 పాఠశాలను మూతపడతాయని ఆందోళన వ్యక్తం చేశారు. దీనివల్ల గిరిజన చిన్నారులకు విద్య దూరమవుతుందని వాపోయారు. ఈ ప్రక్రియను ప్రభుత్వం వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో గిరిజన సంఘం నాయకులు సన్నిబాబు, దేవరాజు, రాధాకృష్ణ, గంగాధరం, కృష్ణబాబు, లోహిదాసుడు, ప్రభాకర్, రాంజీ, మత్స్య కొండబాబు, కోటిబాబు, విష్ణుమూర్తి, చిరంజీవి, కొండలరావు పాల్గొన్నారు.

కూరగాయలకు గిట్టుబాటు ధరకు చర్యలు

పాడేరురూరల్, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో కూరగాయలకు గిట్టుబాటు ధరలను కల్పించేందుకు రైతు బజారులలో అమ్ముకొనేలా చర్యలు చేపట్టామని జిల్లా వ్యవసాయ వాణిజ్య, మార్కెటింగ్ అధికారి పీఆర్.రాకేశ్ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రస్తుతం కూరగాయల సీజన్ అయినందున ఎక్కువ సంఖ్యలో సరుకు దిగుబడి రావడం, పల్లెల్లో తగినంత ధర రాకపోవడంతో రైతులు ఇబ్బంది పడుతున్నట్టయితే రైతు బజారులో ఆ రోజు ఉన్న ధరకు అమ్ముకొనేందుకు అవకాశం కల్పిస్తామన్నారు. ఏ రైతుకైనా ఈ పరిస్థితి ఏర్పడితే మండలంలో అందుబాటులో ఉన్న ఉద్యానవన శాఖాధికారులు లేదా వ్యవసాయ మార్కెటింగ్ కమిటీ కార్యదర్శుల 7671812411, 9441359774 నంబర్లకు ఫోన్ చేసి వివరాలు అందించాలన్నారు. వారు విశాఖపట్నం సహాయ మార్కెటింగ్ సంచాలకులను సంప్రదించి మీ సరుకును విశాఖపట్నం రైతు బజారులో నేరుగా అమ్ముకొనే అవకాశం కల్పిస్తారన్నారు. అలా చేయడం వల్ల రైతుకు ఆర్థిక నష్టం వాటిల్లదన్నారు. రైతులకు ఏ విధమైన సందేహాలు ఉన్నా 9494329096 నంబరుకు సంప్రదించాలన్నారు.

నేడు కంటి వైద్య శిబిరం

అనంతగిరి, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పినకోట ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలోని మంగళవారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్టు వైద్యాధికారి జి.వెంకటేశ్, కంటి వైద్య నిపుణులు రమణబాబు తెలిపారు. విజయనగరం పుష్పగిరి కంటి ఆస్పత్రి సహకారంతో కంటి పరీక్షలు చేసి, అవసరమైన వారికి ఆపరేషన్ చేస్తారని చెప్పారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని వారు కోరారు.



బంగారయ్యపేటలో రైతులతో మాట్లాడుతున్న కలెక్టర్ విజయకృష్ణన్

రీ సర్వేపై అపోహలు పెట్టుకోవద్దు

▸▸ అనకాపల్లి జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్

నర్సీపట్నం, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం చేపడుతున్న భూముల రీసర్వేపై ఎటువంటి అపోహలు పెట్టుకోవద్దని జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్ సూచించారు. నర్సీపట్నం మండలం వేములపూడి రెవెన్యూ పరిధిలోని బంగారయ్యపేటలో భూములు రీసర్వే పనులు సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ భూ సమస్యలు పరిష్కరించి, రైతులకు ఇబ్బంది లేకుండా చేయడానికి ప్రభుత్వం రీ సర్వే చేపడుతుందని తెలిపారు. ఏమైనా ఇబ్బందులు ఉంటే అధికారుల దృష్టికి తీసుకువెళ్లాలని సూచించారు. సర్వే మీద ఎటువంటి అనుమానాలు పెట్టుకోవద్దని చెప్పారు. రైతులకు సమాచారం ఇచ్చి రీ సర్వే చేయాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. రైతుల సందేహాలు నివృత్తి చేయాలని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో వీవీ రమణ, తహసీల్దార్ రామారావు పాల్గొన్నారు.

టెన్త్‌లో శతశాతం ఉత్తీర్ణత సాధించాలి

▸▸ సహాయ సాంఘిక సంక్షేమ శాఖాధికారి గోపీనాథరావు



వసతిగృహ సంక్షేమ అధికారులతో మాట్లాడుతున్న ఏఎస్‌డబ్ల్యూవో

నర్సీపట్నం, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): పదో తరగతి పరీక్షల్లో శతశాతం ఫలితాలు సాధించేందుకు వసతిగృహ సంక్షేమ అధికారులు కృషి చేయాలని సహాయ సాంఘిక సంక్షేమ శాఖ అధికారి (ఏఎస్‌డబ్ల్యూవో) గోపీనాథరావు సూచించారు. ఏఎస్‌డబ్ల్యూవో కార్యాలయంలో సోమవారం హెచ్‌డబ్ల్యూవోలతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎస్సీ వసతి గృహాల్లో శతశాతం ఉత్తీర్ణత లక్ష్యంగా పని చేయాలని ఆదేశించారు. మెనూను పక్కాగా అమలు చేయాలని సూచించారు. చదువుతో పాటు క్రీడల్లో కూడా పిల్లలు రాణించే విధంగా కృషి చేయాలన్నారు. వసతి గృహాల భవనాల మరమ్మతు పనులు పర్యవేక్షించాలని, ఎప్పటికప్పుడు పురోగతి తెలియజేయాలని ఆమె సూచించారు. హాస్టల్ విద్యార్థుల కోసం ఆరోగ్య శిబిరాలు నిర్వహించాలన్నారు.

వేంకటేశ్వరస్వామికి తొలి పంచదార బస్తా

చోడవరం, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): గోవాడ వేంకటేశ్వరస్వామికి గోవాడ షుగర్ ఫ్యాక్టరీలో ఉత్పత్తి అయిన తొలి పంచదార బస్తాను ఎండీ వి.సన్యాసినాయుడు సోమవారం సమర్పించారు. ఏటా క్రషింగ్ సీజన్‌లో తొలి బస్తాను స్వామికి సమర్పించడం ఆనవాయితీ. ఇందులో భాగంగా ఫ్యాక్టరీ ఎండీ పూజాధికాలు నిర్వహించిన అనంతరం పంచదార బస్తాను స్వామికి సమర్పించారు. కార్యక్రమంలో ఫ్యాక్టరీ అధికారులు పాల్గొన్నారు.



స్వామికి పంచదార బహూకరిస్తున్న ఫ్యాక్టరీ ఎండీ సన్యాసినాయుడు

తాగునీటి పథకానికి రోడ్డు సౌకర్యం కల్పించాలని ఆందోళన



తహసీల్దార్ కార్యాలయం వద్ద నినాదాలు చేస్తున్న పల్లావూరు గ్రామస్థులు

గొలుగొండ, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): తాగునీటి పథకానికి రోడ్డు సౌకర్యం కల్పించాలని పల్లావూరు గ్రామస్థులు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ పూర్వం తాగునీటి పథకం ఏర్పాటు చేసిన స్థలం గ్రామానికి, ఇతర అవసరాలకు కేటాయించారని తెలిపారు. గత ఏడాదిలో ఈ భూమికి పట్టాదారు పాసుపుస్తకాలు రెవెన్యూ అధికారులు మంజూరు చేసినట్టు చెప్పారు. దీనిపై పరిశీలించి రోడ్డు సౌకర్యం కల్పించాలని ఆయన డిమాండ్ చేశారు. అనంతరం తహసీల్దార్ శ్రీనివాసరావుకు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ ఎలమంచిలి రఘురామచంద్రరావుతో పాటు నాయకులు కొలగాని రామారావు తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి ఎద్దడి నివారణకు మొబైల్ ఆటో ప్రారంభం



మొబైల్ ఆటో ప్రారంభిస్తున్న ఎంపీడీవో సువర్ణరాజు

దేవరాపల్లి, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి) మండలంలో తాగునీటి ఎద్దడి నివారించడానికి మొబైల్ ఆటోను ప్రారంభించినట్టు ఎంపీడీవో సువర్ణరాజు తెలిపారు. సోమవారం ఈ ఆటోను ప్రారంభించిన అనంతరం ఆయన మాట్లాడారు. క్రాష్ ప్రోగ్రాం ద్వారా తాగునీటి బోర్లు, నీటి పథకాలు మెకానిక్ ద్వారా మరమ్మతులు చేయడానికి మొబైల్ ఆటో ఉపయోగపడుతుందని చెప్పారు. గ్రామాల్లో ఆటో ద్వారా తిరిగి మందస్తు చర్యలు చేపడతామని ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈఈ చంద్రశేఖర్ చెప్పారు. కార్యక్రమంలో ఏవో లక్ష్మీనారాయణ, సిబ్బంది లక్ష్మి, గంగాధర్ పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ అభ్యర్థి గాదెకు మద్దతుగా ప్రచారం

దేవరాపల్లి, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పీఆర్టీయూ అభ్యర్థి గాదె శ్రీనివాసులనాయుడు మద్దతుగా సోమవారం కాశీపురం, పెదనందిపల్లి, కె.జీమండ బీసీ, తెనుగుపూడి, పినకోట, జీన బాడు గురుకుల, ఆశ్రమ పాఠశాలల్లో విస్తృతంగా ప్రచారం చేశారు. పీఆర్టీయూ రాష్ట్ర కార్యదర్శి అడిగర్ల సత్యంనాయుడు, నాయకులు వీరభద్రరావు, బోను వెంకటరావు, నాయుడుబాబు, త్రినాథ్, కె.రాంబాబు తదితరులు ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు.

అడవుల్లో అగ్ని ప్రమాదాల నివారణకు చర్యలు

▸▸ నర్సీపట్నం డీఎఫ్‌వో శ్యామ్యూల్

కృష్ణాదేవిపేట, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): వేసవిలో అడవుల్లో అగ్ని ప్రమాదాలు జరగకుండా తగిన చర్యలు చేపడుతున్నామని నర్సీపట్నం డివిజనల్ అటవీ అధికారి ఎం.శ్యామ్యూల్ చెప్పారు. కొప్పుకొండ-నల్లగొండలోని 62, 63 టేకు ప్లాంటేషలను సోమవారం తనిఖీలు చేశారు. అనంతరం గొలుగొండ మండలం కృష్ణాదేవిపేట అటవీ రేంజ్ కార్యాలయాన్ని సందర్శించి, అక్కడ ఎన్ఆర్‌జీఎస్ నిధులతో అటవీ శాఖ ఆధ్వర్యంలో బ్యాగ్ మొక్కల కోసం ఏర్పాటు చేస్తున్న ప్రక్రియను పరిశీలించారు. ఈ సందర్భంగా డీఎఫ్‌వో మాట్లాడుతూ అడవుల్లో అగ్ని ప్రమాదాల నివారణకు అధికారులు, సిబ్బంది అనునిత్యం అప్రమత్తంగా ఉండాలని ఆదేశించినట్టు చెప్పారు. కృష్ణాదేవిపేట అటవీ రేంజ్ పరిధిలో 70 వేల బ్యాగ్ మొక్కలతో పాటు వంద బెడ్ టేకు, ఇతర అటవీ జాతుల నర్సరీలను ఏర్పాటు చేస్తున్నామన్నారు. వీటితో రైతులకు అవసరమైన సరుగుడు, జామ, నేరడితో పాటు అటవీ ప్రాంతాల్లో టేకు, నల్లమద్ది, రోజ్‌వుడ్ తదితర జాతుల మొక్కలతో అడవుల అభివృద్ధి కృషి చేస్తున్నామన్నారు. శిథిలమైన కృష్ణాదేవిపేట అటవీ కార్యాలయానికి నూతన భవనాల కోసం రూ.50 లక్షలతో ప్రభుత్వానికి ప్రతిపాదన పంపామన్నారు.



అటవీ కార్యాలయంలో మొక్కలు వేసే బ్యాగులను పరిశీలిస్తున్న డీఎఫ్‌వో

కలప అక్రమ రవాణాపై నిఘా ఏర్పాటు చేశామన్నారు. దీనికి ప్రజలు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో అటవీ రేంజ్ అధికారి కె.శ్రీనివాసరావు, డిప్యూటీ రేంజ్ అధికారి సత్యనారాయణ, సెక్షన్ అధికారి లక్ష్మణ్ పాల్గొన్నారు.

సమస్యలపై అంగన్‌వాడీ కార్యకర్తల ఆందోళన

నర్సీపట్నం, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): సమస్యలపై అంగన్‌వాడీ కార్యకర్తలు సోమవారం ఆందోళన కార్యక్రమం చేపట్టారు. సీఐటీయూ ఆధ్వర్యంలో అసోసియేషన్ సభ్యులు స్థానిక సీడీపీవో కార్యాలయం ఎదుట ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా కార్యదర్శి జి.కోటేశ్వరరావు మాట్లాడుతూ మినీ అంగన్‌వాడీ కేంద్రాలను మెయిన్ అంగన్‌వాడీ కేంద్రాలుగా అప్‌గ్రేడ్ చేయాలని డిమాండ్ చేశారు. గత ప్రభుత్వంలో జరిగిన ఒప్పందాలను కూటమి ప్రభుత్వం అమలు చేయాలని కోరారు. నిత్యావసర సరకుల ధరలకు అనుగుణంగా మెనూ చార్జీలు పెంచాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షురాలు సీహెచ్.మహాలక్ష్మి, కార్యదర్శి ఆర్.రమణమ్మ పాల్గొన్నారు.

రావికమతంలో...

రావికమతం: మండల కేంద్రంలోని ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయం ఎదుట అంగన్‌వాడీలు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయూ కన్వీనర్ వి.సత్యవతి, ప్రాజెక్టు ప్రధాన కార్యదర్శి ఎస్.సత్యవేణి మాట్లాడుతూ శ్రమకు తగ్గ వేతనాలు ఇవ్వాలని కొంత కాలంగా నిరసనలు తెలియజేస్తున్నా ప్రభుత్వాలు స్పందించకపోవడం దారుణమన్నారు. ఎన్నికల ముందు అమలు చేస్తామన్న వేతన పెంపును ప్రభుత్వం నేటికీ పట్టించుకోలేదని వాపోయారు. ఈ కార్యక్రమంలో సంఘం ప్రతినిధులు పి.వరలక్ష్మి, కొండమ్మ, పి.లక్ష్మి, పి.బాగ్యలక్ష్మి పాల్గొన్నారు.





నర్సీపట్నం సీడీపీవో కార్యాలయం ఎదుట అంగన్‌వాడీల ధర్నా... రావికమతంలో అంగన్‌వాడీల నినాదాలు

మాడుగులలో...

మాడుగుల: స్థానిక ఐసీడీఎస్ కార్యాలయం ఎదుట అంగన్‌వాడీలు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సమస్యలపై నినాదాలు చేశారు. హామీలు అమలు చేసే దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు నరసింహమూర్తి, ఆర్.దేముడు నాయుడు, కార్లి భవానీ, కార్యకర్తలు, సహాయకులు పాల్గొన్నారు.

నేడు జిల్లా స్థాయి గుర్రం పరుగు పోటీలు

చీడికాడ, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తంగుడుపల్లి గ్రామంలో ఈ నెల 18న జిల్లా స్థాయి గుర్రం పరుగు పోటీలు నిర్వహిస్తామని ఉత్సవ కమిటీ ప్రతినిధులు తెలిపారు. ఆంజనేయ స్వామి తీర్థం పురస్కరించుకొని ఈ పోటీలు ఏర్పాటు చేస్తున్నట్టు చెప్పారు. రాత్రికి పలు సాంస్కృతిక కార్యక్రమాలు జరుగుతాయన్నారు.

2,780 మంది రైతుల భూ ఆధార్ నమోదు

మాకవరపాలెం, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): మండలంలో 2,780 మంది రైతులు భూ ఆధార్ నమోదు చేసుకున్నారని మండల వ్యవసాయాధికారి చిరంజీవి తెలిపారు. గిడుతూరు, లచ్చన్నపాలెం, తామరం తదితర గ్రామాల్లో భూ ఆధార్ నమోదు కేంద్రాలను సోమవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని గ్రామాల్లోని సచివాలయాల్లో భూ ఆధార్ నమోదు ప్రక్రియ వేగవంతంగా జరుగుతుందన్నారు. ఇంతవరకు 2,780 మంది రైతులు తమ పేర్లను నమోదు చేసుకున్నారన్నారు. అలాగే జిల్లాలో భూ ఆధార్ నమోదులో మాకవరపాలెం మండలం నాలుగో స్థానంలో ఉందన్నారు. భూ ఆధార్ చేసుకోవడం ద్వారా ప్రభుత్వం అందించే రాయితీ పథకాలతో పాటు రైతు భూమికి శాశ్వతమైన నంబరు లభిస్తుందని ఆయన చెప్పారు. ఈ అవకాశాన్ని రైతులు వినియోగించుకోవాలని కోరారు.

4న మోదకొండమ్మ తీర్థ మహోత్సవం

మాడుగుల, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): ఉత్తరాంధ్ర జిల్లాల ఆరాధ్య దైవం మాడుగుల మోదకొండమ్మ తీర్థ మహోత్సవం వచ్చే నెల 4న నిర్వహిస్తామని ఆలయ కమిటీ చైర్మన్ పుప్పాల అప్పలరాజు తెలిపారు. సోమవారం విలేకరులతో ఆయన మాట్లాడుతూ ప్రతి ఏటాడి మాదిరిగా అమ్మవారి తీర్థ మహోత్సవాన్ని మంగళవారం నిర్వహించేందుకు కమిటీ ప్రతినిధులంతా చర్యలు తీసుకున్నామన్నారు. ఈ కార్యక్రమాన్ని భక్తులు విజయవంతం చేయాని ఆయన కోరారు.

నేటి నుంచి ప్రత్యేక ఆధార్ నమోదు కేంద్రాలు

రావికమతం, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): మండలంలో మంగళవారం నుంచి ప్రత్యేక ఆధార్ నమోదు కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నట్టు ఎంపీడీవో కె.వెంకన్నబాబు సోమవారం తెలిపారు. 18న చీమలపాడు, 19న దొండపూడి, 20న చినపాచిల, 21న రావికమతం, 24న కన్నంపేట, 25న కొత్తకోట-1, 27న తోటకూరపాలెం, 28న కొమిర అంగన్‌వాడీ కేంద్రాలలో ఈ కేంద్రాలు కొనసాగుతాయని చెప్పారు. వీటిని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

తాగునీటి సమస్య లేకుండా బోర్ల మరమ్మతు

రోలుగుంట, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తాగునీటి ఎద్దడి నివారణకు బోర్లను మరమ్మతు చేస్తున్నట్టు ఎంపీడీవో నాగేశ్వరరావు తెలిపారు. సోమవారం విలేకరులతో ఆయన మాట్లాడారు. మండలంలోని 24 పంచాయతీల్లో తాగునీటి సమస్య తలెత్తకుండా నివారణ చర్యలు చేపడుతున్నామన్నారు. ఈ కార్యక్రమం వచ్చే నెల 15వ తేదీ వరకు కొనసాగుతుందని చెప్పారు.

సొసైటీ నిధులు రికవరీ చేయాలి

రోలుగుంట, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): జానకిరాంపురం సొసైటీలో స్వాహా చేసిన నిధులను రికవరీ చేయాలని జిల్లా కలెక్టర్‌కు సొసైటీ సభ్యులు గొల్లు నారాయణరావు, కిల్లాడ సాంబమూర్తి తదితరులు సోమవారం వినతిపత్రం అందించారు. గత నెల 6న సెక్షన్ 51 కింద విచారణ చేపట్టాలని ఆ శాఖ డిప్యూటీ రిజిస్ట్రార్ స్వరూపరాణి ఉత్తర్వులు జారీ చేసినా తాత్సారం చేస్తున్నారన్నారు. దీనిపై పలుమార్లు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసినా స్పందన లేదన్నారు. దాదాపు రూ.2 కోట్లకు పైగా నిధులు స్వాహా చేశారని ఆరోపించారు. పత్రికల్లో పలు కథనాలు వచ్చినా చర్యలు తీసుకోవడంలో వెనకడుగు వేస్తున్నారన్నారు. ఇప్పటికైనా 51 సెక్షన్ కింద విచారణ చేపట్టాలని ఫిర్యాదులో పేర్కొన్నారు.

కిచెన్ గార్డెన్లు పెంచాలి

దేవరాపల్లి, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ కిచెన్ గార్డెన్లు పెంచాలని ఎంపీడీవో సువర్ణరాజు సూచించారు. సోమవారం గ్రామైక్య సంఘాల సభ్యులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ దుంప జాతి మొక్కలు పెంచాలని సూచించారు. ఇంటి నుంచి చెత్తను వృథా చేయకుండా ఎరువులు తయారు చేయాలని, ఆరోగ్యకరమైన ఆహార పదార్థాలు తినాలని ఆయన చెప్పారు.

గిరిజన గ్రామాల్లో అంధకారం

▸▸ విద్యుత్ సరఫరాకు తీవ్ర అంతరాయం

చీడికాడ, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): మండలంలో వీరభద్రునిపేట శివారు కొన్నెంపూడి, గొప్పూరు గిరిజన గ్రామాల్లో అంధకారం అలముకుంది. రెండు రోజులుగా విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుండడంతో గిరిజనులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ఈ విషయమై సంబంధిత ఏఈకి ఎన్నిమార్లు చెప్పినా స్పందించలేదని వారు అసహనం వ్యక్తం చేశారు. విద్యుత్ లేకపోవడం వల్ల వాటర్ ట్యాంకుల ద్వారా వచ్చే మంచినీటికి సమస్య తలెత్తుతున్నదని వాపోయారు. అలాగే ఫోన్‌లు చార్జింగ్ లేక సమాచారానికి దూరమవుతున్నారు. అటవీ ప్రాంతానికి దగ్గరగా ఉండడంతో ఏ జంతువులు వస్తాయోనని తీవ్ర భయాందోళన చెందుతున్నామని వారు తెలిపారు. దీనిపై విద్యుత్ శాఖ ఏఈ నమ్మి వెంకటరావును వివరణ కోరగా, గిరిజనులు ఆందోళన చెందవద్దని, వెంటనే మరమ్మతులు చేపట్టి విద్యుత్ సరఫరా చేస్తామని వివరించారు.

పరిసరాల పరిశుభ్రతతోనే ఆరోగ్యం

▸▸ విస్తరణాధికారుల శిక్షణ శిబిరంలో డీపీవో శిరీషారాణి



శిక్షణ శిబిరంలో మాట్లాడుతున్న జిల్లా పంచాయతీ అధికారి శిరీషారాణి

కె.కోటపాడు, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుంటేనే ఆరోగ్యంగా జీవించగలమని జిల్లా పంచాయతీ అధికారి శిరీషారాణి చెప్పారు. మండలంలోని చౌడువాడ గ్రామంలో సోమవారం ఏర్పాటు చేసిన అనకాపల్లి డివిజన్ పంచాయతీ విస్తరణ అధికారులు, క్లాప్ మిత్రులు, పంచాయతీ కార్యదర్శులకు శిక్షణ శిబిరంలో ఆమె మాట్లాడారు. పరిశుభ్రతపై ప్రజల్లో అవగాహన కలిగించడం, ప్రజల భాగస్వామ్యం పెంచడం, నీటి ద్వారా వచ్చే వ్యాధులను తగ్గించడం, పర్యావరణ ప్రజారోగ్యానికి ప్రాధాన్యత తదితర కార్యక్రమాలు చేపట్టడం జరుగుతుందన్నారు. ఇందుకోసం పంచాయతీ స్థాయిలో సిబ్బంది అంకితభావంతో పనిచేయాలని సూచించారు. జిల్లా పంచాయతీ వనరుల కేంద్రం సమన్వయకర్త నాగలక్ష్మి మాట్లాడుతూ అనకాపల్లి డివిజన్‌లో 520 సంపద తయారీ కేంద్రాలు పూర్తిస్థాయిలో పనిచేసేలా చూడాలని కార్యదర్శులు, ఈవోపీఆర్డీలను ఆదేశించారు. వర్మీ కంపోస్టును ఎక్కువగా నర్సరీలకు, కూరగాయల పెంపకందారులకు సరఫరా చేయాలన్నారు. అనంతరం పారిశుధ్య సిబ్బందితో చెత్త సేకరణ అంశంపై పలువురు మాట్లాడారు. కార్యక్రమంలో ఎంపీడీవో సాంబశివరావు, డివిజనల్ పంచాయతీ అధికారి మూర్తి, 12 మండలాలకు చెందిన ఈవోపీఆర్డీలు, కార్యదర్శులు పాల్గొన్నారు.

బాలచెంచుమ్మకు కలశాల ఊరేగింపు



కలశాలు, ఘటాలతో ఊరేగింపుగా వెళ్తున్న భక్తులు, గ్రామస్థులు

రావికమతం, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోనే పేరుగాంచిన గర్నికం బాల చెంచుమ్మ మహోత్సవం సందర్భంగా సోమవారం కలశాల ఊరేగింపు కన్నులపండువగా జరిగింది. గ్రామ పుర వీధుల్లో భక్తులు కలశాలు, ఘటాలతో భారీ ఊరేగింపు నిర్వహించి అమ్మవారికి సమర్పించారు. 19న జరగనున్న అమ్మవారి తీర్థ మహోత్సవం సందర్భంగా గ్రామంలో 250 మంది భక్తులు అమ్మవారి మాలాధారణ చేశారు. 21 రోజులుగా అత్యంత భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు. బుధవారంతో దీక్ష పూర్తికావడం, అదే రోజున పెద్ద ఎత్తున తీర్థ మహోత్సవం జరగనుండడంతో మాలధారణ చేసిన భక్తులు, గ్రామస్థులు బాల చెంచుమ్మతల్లికి పురవీధులలో భారీగా కలశాలు ఊరేగించారు. అనంతరం అమ్మవారికి సమర్పించారు.

ఘనంగా అడవిరాజుబాబుల పండుగ



ఊరేగింపుగా అడవిరాజుబాబుల గుడికి వెళ్తున్న భక్తులు

రోలుగుంట, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో సోమవారం అడవిరాజుల బాబు పండుగను ఘనంగా నిర్వహించారు. గ్రామంలో ఉన్న అగడిరాజుబాబులను భక్తులు దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. ఈ సందర్భంగా గ్రామం నుంచి ఉదయం అధిక సంఖ్యలో భక్తులు ఊరేగింపుగా తరలివెళ్లి రాజుబాబుల వారిని దర్శించుకున్నారు. అనంతరం ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఆలయం వద్ద మధ్యాహ్నం ఏర్పాటు చేసిన అన్నసమారాధన కార్యక్రమానికి అధిక సంఖ్యలో భక్తులు హాజరయ్యారు.

హైబ్రిడ్ వరి పంట సాగులో మెళకువలు పాటించాలి

రావికమతం, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): హైబ్రిడ్ రకం వరి సాగులో మెళకువలు పాటించాలని కేవీకే శాస్త్రవేత్తలు సూచించారు. మేడివాడ గ్రామంలో హైబ్రిడ్ వరి పంటను సోమవారం పరిశీంచారు. అధిక దిగుబడి నిచ్చే ఓంకార్ వరి సాగులో సూచనలను అనుసరించి కొద్దిపాటి మెళకువలు పాటిస్తే ఆశించిన స్థాయిలో దిగుబడి వస్తుందని శాస్త్రవేత్తలు ఎస్.రాజ్‌కుమార్, సౌజన్య వివరించారు. వరిలో మురుగు నీటిని తక్షణమే తొలగించి, కాస్త తేమ ఆరిన తరువాత మళ్లీ నీరు పెట్టాలని వారు సూచించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి డి.రూప, తదితరులు పాల్గొన్నారు.

రాత్రి 11 గంటల తర్వాత రోడ్లపై తిరిగితే చర్యలు

▸▸ డీఎస్పీ పి.శ్రీనివాసరావు

నర్సీపట్నం, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో రాత్రి 11 గంటల తర్వాత మెయిన్ రోడ్డులో అనసరంగా తిరిగితే చర్యలు తప్పవని డీఎస్పీ పి.శ్రీనివాసరావు హెచ్చరించారు. సోమవారం విలేకరులతో ఆయన మాట్లాడుతూ దొంగతనాల నివారణకు ప్రత్యేక దృష్టి పెట్టామన్నారు. ఇప్పటి వరకు ఉన్న రెండు బీట్లు నాలుగుకు పెంచామన్నారు. బీట్ సిబ్బంది కోసం నాలుగు బైక్‌లు సిద్ధం చేశామన్నారు. తాళాలు వేసి ఉన్న ఇళ్లను గుర్తించి నిఘా పెడుతున్నామని ఆయన తెలిపారు. ఇద్దరు ఏఎస్ఐలు, ఇద్దరు హెచ్‌సీలతో ప్రత్యేకంగా క్రైమ్ బృందాన్ని ఏర్పాటు చేశామన్నారు. కళాశాలలు, హాస్టల్స్‌లో మత్తు పదార్థాలు, పోక్సో, సైబర్ నేరాలు, ట్రాఫిక్ నిబంధనలపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్నామని ఆయన తెలిపారు.

ప్రకృతి సాగు పద్ధతులతో రైతులకు ఎంతో మేలు

చోడవరం, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): ప్రకృతి సాగు పద్ధతులతో రైతులకు చక్కని ప్రయోజనాలు ఉన్నాయని ప్రకృతి వ్యవసాయ విభాగం సీనియర్ రిసోర్సుపర్సన్ జి.దేముళ్లు చెప్పారు. నరసాపురం గ్రామంలో ప్రకృతిసాగు పద్ధతిలో వ్యవ సాయం చేస్తున్న రైతు పంటను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రకృతి సాగు ద్వారా చేసే వ్యవసాయం వల్ల భూమిలో నీటి నిల్వ సామర్థ్యం పెరుగుతుందన్నారు. అన్ని రకాల పంటలకు దీనివల్ల మేలు చేకూరుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ విభాగం సిబ్బంది నాగమణి, నాయుడుబాబు, శివగణేశ్, మహేశ్వరి పాల్గొన్నారు.

ఇంట్లోకి దూసుకుపోయిన ట్రాక్టర్

ఎవరూ లేకపోవడంతో తప్పిన ప్రమాదం



ఇంట్లోకి దూసుకుపోయిన ట్రాక్టర్ ఇదే..

నర్సీపట్నం, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): మునిసిపాలిటీ పరిధిలోని జోగినాథునిపాలెం రోడ్డులో సోమవారం బైక్‌ను తప్పించబోయి ఓ ట్రాక్టర్ అదుపు తప్పి ఇంట్లోకి దూసుకుపోయింది. ఆ సమయంలో ఇంట్లో ఎవరూ లేరు. దీంతో పెను ప్రమాదం తప్పిందని స్థానిక ప్రజలు ఊపిరి తీసుకున్నారు.

చోడవరం సర్పంచ్ భర్త మృతి



శ్రీనివాసరావు (ఫైల్)

చోడవరం, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): మేజర్ పంచాయతీ చోడవరం సర్పంచ్ బండి నూకరత్నం భర్త, దళిత నాయకుడు బండి శ్రీనివాసరావు (54) సోమవారం మృతి చెందారు. ఆదివారం రాత్రి తీవ్ర అస్వస్థతకు గురైన శ్రీనివాసరావును కుటుంబ సభ్యులు విశాఖలోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. గుండె పోటు తీవ్రంగా రావడంతో చికిత్స పొందుతూ మృతి చెందారు. కాగా శ్రీనివాసరావు మృతి పట్ల ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్ రాజు, పంచాయతీ పాలకవర్గం సభ్యులు సంతాపం తెలిపారు. కుటుంబ సభ్యులను ఓదార్చారు.

విలేకరిపై దాడిచేసిన వారిని శిక్షించాలి

చోడవరం, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): పార్వతీపురం మన్యం జిల్లాలోని మక్కువ మండలంలో విలేకరి రామారావుపై దాడి చేసిన నాయకుడిని కఠినంగా శిక్షించాలని ఏపీడబ్ల్యూజేఎఫ్ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం తహసీల్దార్‌కు వినతిపత్రం సమర్పించారు. విధి నిర్వహణలో ఉన్న జర్నలిస్టుల పట్ల అనుచితంగా ప్రవర్తించిన నాయకుడు గుల్ల వేణుగోపాలరావుపై కేసులు నమోదు చేయాలని, జర్నలిస్టు ప్రాణానికి రక్షణ కల్పించాలని ఫెడరేషన్ జిల్లా గౌరవ అధ్యక్షుడు కాంతారావు డిమాండ్ చేశారు. అనంతరం తహసీల్దార్ రామారావుకు వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో జర్నలిస్టు సంఘం నేత కోవెల శ్రీనివాసరావు పాల్గొన్నారు.

కాశీపురంలో యూనిఫారాల వితరణ

దేవరాపల్లి, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): కాశీపురం జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులకు ఆదిరెడ్డి సత్యం కుమారుడు సోమవారం యూనిఫారాలను పంపిణీ చేశారు. అలాగే క్రీడా దుస్తులను అందించారు. కార్యక్రమంలో సర్పంచ్ ఆదిరెడ్డి వరలక్ష్మి, పాఠశాల హెచ్‌ఎం సుందరి, స్థానిక నేత కె.రాంబాబు పాల్గొన్నారు.

ఎల్‌బి.పట్నంలో వైద్య శిబిరం

చీడికాడ, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): ఎల్‌బి.పట్నం గ్రామంలో సోమవారం వైద్య శిబిరం జరిగింది. 46మంది రోగులను తనిఖీలు చేశారు. వీరిఒ ఎక్కువ మంది బీపీ, షుగర్ పేషెంట్లు ఉన్నారు. వీరందరికీ మందులు పంపిణీ చేశారు. పరిసరాలు, వ్యక్తిగత పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. హెచ్‌వీ భవానీ, ఏఎన్ఎం జి.నాగమణి సేవలందించారు.

సాయిబాబాకు ప్రత్యేక పూజలు

మాకవరపాలెం: గిడుతూరు సాయిబాబా ఆలయంలో సోమవారం ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. మధ్యాహ్నం అన్నసమారాధన నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

రోగి మృతితో బంధువుల ఆందోళన

విశాఖపట్నం, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): గుండె సంబంధిత అనారోగ్యంతో బాధపడుతున్న చోడవరం సమీపంలోని రెల్ల గ్రామానికి చెందిన శ్రీధర్ అనే రోగిని చికిత్స నిమిత్తం బంధువులు ఆదివారం కేర్ ఆసుపత్రిలో చేర్పించారు. రూ.1.7 లక్షలు చికిత్స నిమిత్తం చెల్లించారు. ఆ రోగి ఆదివారం రాత్రి మృతి చెందాడు. శస్త్రచికిత్స విఫలం కావడం వల్లే మృతిచెందాడని రోగి బంధువులు ఆరోపించారు. రూ.5 లక్షలు చెల్లిస్తేనే మృతదేహాన్ని అప్పగిస్తామని ఆసుపత్రివర్గాలవారు అన్నారని తెలిపారు. దీనితో వారంతా ఆసుపత్రి వద్ద ఆందోళన చేశారు. చివరకు ఆరిలోవ సీఐకి ఫిర్యాదు చేయడంతో ఆయన వచ్చి సంప్రదింపులు చేసిన అనంతరం మృతదేహాన్ని రోగి బంధువులకు అప్పగించారు. దీనితో ఆందోళన సద్దుమణిగింది.

పరిశోధన పరుగుపెట్టేలా..!

పరిశోధకులకు అవసరమైన పరికరాలను అందించే ఐ స్టెమ్

- స్టార్టప్ ఎంటర్‌ప్రెన్యూర్స్, పరిశ్రమ నిర్వాహకులకు మేలు
- 2022లో ప్రారంభించిన కేంద్ర ప్రభుత్వం
- ఔత్సాహికుల్లో ఇప్పటికీ కొరవడిన అవగాహన
- తక్కువ ఖర్చుతో పరిశోధనలు చేసే అవకాశం
- లాగిన్ అయిన ఏయూ, గీతం, ఐఐపీఈ వర్సిటీలు, విశాఖలో సుమారు 20కు పైగా కాలేజీల్లోని రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ ల్యాబ్‌లు



(విశాఖపట్నం, ఆంధ్రజ్యోతి)

భిన్నమైన అంశాలపై పరిశోధనలు సాగించే వారికి అధునాత పరికరాలు అందుబాటులో లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. దీంతో వారి పరిశోధనలకు ఆటంకం ఏర్పడుతోంది. దీనిని గుర్తించిన కేంద్ర ప్రభుత్వం పరిశోధకులకు అవసరమైన అధునాత పరికరాలను సమకూర్చేందుకు సిద్ధమైంది. ఇందులో భాగంగానే భారత ప్రభుత్వ ప్రిన్సిపల్ సైంటిఫిక్ అడ్వైజరీ కార్యాలయం ఇంటరాక్టివ్ పోర్టల్ ఐ స్టెమ్‌ను రూపొంది ంచింది.

ఇండియన్ సైన్స్ టెక్నాలజీ అండ్ ఫెసిలిటీస్ మ్యాప్ (ఐ స్టెమ్) పేరుతో అందుబాటులోకి వచ్చిన ఈ పోర్టల్‌లో దేశంలోని వివిధ యూనివర్సిటీలు, కాలేజీల్లో ఉన్న రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ (ఆర్‌అండ్‌డీ) ల్యాబ్‌ల వివరాలు ఉంటాయి. వాటిల్లో ఉండే పరికరాలతో పరిశోధనలు చేయాలనుకునే వారంతా కొంత మొత్తాన్ని చెల్లించి పరిశోధనను పూర్తిచేసుకోవచ్చు. కొన్ని ఆర్‌అండ్‌డీ ల్యాబ్‌ల్లో ఉండే పరికరాలు స్టార్టప్స్ ఎంటర్‌ప్రెన్యూర్స్, పరిశ్రమల నిర్వాహకులు తమ పనితీరును మెరుగుపర్చుకునేందుకు ఉపయోగపడతాయి. వారు ఈ పోర్టల్‌లో రిజిస్టరైన పరికరాలను వినియోగించుకోవచ్చు.

దేశ వ్యాప్తంగా 3,310 ఇనిస్టిట్యూట్లు ఈ పోర్టల్‌లో ఇప్పటికే రిజిస్టర్ చేసుకోకాగా, వివిధ ల్యాబ్‌లలో 26,738 పరికరాలు అందుబాటులో ఉన్నాయి. వివిధ రంగాలకు చెందిన 582 మంది నిపుణులు సహకరించేందుకు సిద్ధంగా ఉన్నారు. ఇప్పటివరకు 33,619 మంది పరిశోధకులు ఆర్‌అండ్‌డీ ల్యాబ్‌ల్లోని పరికరాల సాయంతో పరిశోధనలు సాగించారు. మరో 34,773 బుకింగ్ రిక్వెస్ట్‌లు వచ్చాయి.

జిల్లాలో ల్యాబ్‌లు..

ఐ స్టెమ్ పోర్టల్‌లో జిల్లాకు సంబంధించిన అనేక కాలేజీలు, యూనివర్సిటీల్లోని రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ (ఆర్‌అండ్‌డీ) ల్యాబ్‌లు రిజిస్టర్ అయ్యాయి. ఈ ల్యాబ్‌ల్లో పరిశోధకులు, ఎంటర్‌ప్రెన్యూర్స్, పరిశ్రమలకు సంబంధించిన ప్రతినిధులు తమ పరిశోధనకు సంబంధించిన పనులను ఇందులో పూర్తిచేసుకోవచ్చు. ముందుగా ఐ స్టెమ్ వెబ్‌సైట్‌లోకి వెళ్లి రిజిస్టర్ చేసుకోవాలి. అనంతరం ఎంతదూరంలో పరిశోధనకు వెళ్లాలి అని భావిస్తున్నారో దానిని ఎంపిక చేసుకోవాలి. ఆ తరువాత ఏయే ధరల్లో పరిశోధనకు సంబంధించిన పరికరాలు కావాలో ఎంపిక చేసుకోవాలి. ఆ తరువాత అవైలబులిటీలో ఉన్న తేదీలను చూసుకుని ఎంపిక చేసుకోవాలి. అందుకు అనుగుణంగా స్లాట్ లభిస్తుంది. ఆ సమయంలో వెళ్లి ఆర్‌అండ్‌డీ ల్యాబ్‌లో పరిశోధన చేసుకోవచ్చు.

ప్రస్తుతం జిల్లాలో సుమారు 20కిపైగా కాలేజీల్లోని ఆర్‌అండ్‌డీ ల్యాబ్‌లకు చెందిన పదులసంఖ్యలో పరికరాలు ఈ పోర్టల్‌లో రిజిస్టర్ చేశారు. ఇందులో ఆంధ్ర విశ్వవిద్యాలయం, ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ పెట్రోలియం వర్సిటీ అండ్ ఎనర్జీ (ఐఐపీఈ), గీతం, గాయత్రీ విద్యా పరిషత్, సెయింట్ జోసెఫ్‌తోపాటు మరికొన్ని కాలేజీలు ఉన్నాయి. ఈ పరికరాలపై పరిశోధన చేసేందుకు గంటలు, రోజుల వారీగా అవకాశం లభిస్తుంది.

అధునాత పరికరాలు..





విశాఖలో ఇటీవల ఐ-స్టెమ్ నిర్వహించిన సమావేశంలో పాల్గొన్న ఔత్సాహికులు

I-STEM
Linking Researchers and Resources

పోర్టల్‌లో ఇప్పటివరకు రిజిస్టర్ అయిన ఆర్ అండ్‌డీ ల్యాబ్‌ల్లో అధునాత పరికరాలున్నాయి. వీటిలో ఎక్స్‌ఆర్‌డీ, ఎన్ఎంఆర్, మైక్రోస్కోప్, స్టిమ్యులేటెడ్ ఎమిషన్ డెప్లేషన్ (స్టెడ్), ఎక్స్‌ఆర్‌డీ, ఆప్టికల్ మైక్రోస్కోప్, సింగిల్ క్రిస్టల్ ఎక్స్‌ఆర్‌డీ స్మార్ట్ అల్ట్రా ఫర్ అవైలబుల్ టెంపరేచర్ డేటా, రామన్ స్పెక్ట్రోస్కోపీ, యూవీ విజుబుల్ స్పెక్ట్రోమీటర్, హై రిజల్యూషన్ ఎక్స్‌ఆర్‌డీ వంటి వందలాది అధునాతన పరికరాలున్నాయి. పరిశోధనలకు అవసరమైన పరికరాల ను అందుబాటులో ఉంచాలన్న ఉద్దేశంతోనే ఈ పోర్టల్‌ను అందుబాటులోకి తెచ్చినట్టు ఐ స్టెమ్ పోర్టల్ నేషనల్ కో-ఆర్డినేటర్ డాక్టర్ హరిలాల్ భాస్కర్ తెలిపారు. పరిశోధకులు, పరిశోధన ల్యాబ్స్‌కు అనుసంధానం చేసే బాధ్యతను తీసుకునే ఉద్దేశంతో దీనిని రూపొందించినట్టు వెల్లడించారు. పరిశోధకులు, స్టార్టప్ నిర్వాహకులు, పరిశ్రమలు ప్రతినిధులు సద్వినియోగం చేసుకుని మరింత ప్రగతి సాధించాలని ఆకాంక్షించారు.

మినిస్ట్రీరియల్ సిబ్బందితో ఎస్పీ సమావేశం

అనకాపల్లి రూరల్, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): జిల్లా పోలీస్ కార్యాలయంలో మినిస్ట్రీరియల్ సిబ్బందితో ఎస్పీ తుహిన్‌సిన్హా సోమవారం సమావేశం ఏర్పాటు చేశారు. విభాగాల వారీగా సమీక్ష చేపట్టి ఉద్యోగుల పనితీరు, సేవల నిర్వహణ వంటి అంశాలను పరిశీలించారు. పోలీస్ సిబ్బందికి వృత్తిపరమైన శిక్షణ, సంక్షేమ పథకాలు, సౌకర్యాల మెరుగుదలపై ప్రత్యేక దృష్టి పెట్టినట్టు ఆయన తెలిపారు. ఉద్యోగుల్లో స్ఫూర్తిని పెంచేందుకు అవసరమైన అన్ని చర్యలను తీసుకుంటున్నట్టు పేర్కొన్నారు. సమావేశంలో ఏఎస్పీ దేవప్రసాద్, ఏవో రామ్‌కుమార్‌పాల్గొన్నారు.

'ఈ నెలాఖరులోగా లైఫ్ సర్టిఫికెట్ సమర్పించాలి'

అనకాపల్లి కలెక్టరేట్, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పింఛన్‌దారులు తమ జీవన ప్రమాణ ధ్రువీకరణ పత్రాన్ని ఈ నెల 28వ తేదీలోగా సమర్పించాలని జిల్లా ఖజానా, గణాంక శాఖ అధికారి సుభాషిణి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. లైఫ్ సర్టిఫికెట్‌ను సకాలంలో సమర్పించి పింఛన్ ఆగిపోకుండా జాగ్రత్తపడాలని ఆమె కోరారు. పింఛన్‌దారులు ఎవరైనా తీవ్ర అనారోగ్యంతో బాధపడుతూ, కార్యాలయానికి వచ్చే పరిస్థితి లేకపోతే.. ఖజానా కార్యాలయం సిబ్బంది వాళ్ల ఇంటికి వెళ్లి జీవన ప్రమాణ పత్రాలను తీసుకుంటారన్నారు. బయోమెట్రిక్ సమస్య వచ్చిన వారు నేరుగా సంబంధిత ఖజానా కార్యాలయంలో జీవన ప్రమాణపత్రాన్ని (మ్యాన్యువల్‌గా) సమర్పించవచ్చునన్నారు.

గురుకులాల్లో ప్రవేశాలకు 6వ తేదీ వరకు దరఖాస్తులు

సబ్బవరం, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): విశాఖపట్నం, అనకాపల్లి జిల్లాలోని సాంఘిక సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నడుస్తున్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలల్లో 2025-26 విద్యా సంవత్సరానికి 5వ తరగతి, ఇంటర్ మొదటి సంవత్సరంలో ప్రవేశాల కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని గురుకుల సొసైటీ సమన్వయాధికారి డాక్టర్ ప్రభావతమ్మ తెలిపారు. సోమవారం సబ్బవరం గురుకుల పాఠశాలకు వచ్చిన సందర్భంగా ఆమె మాట్లాడుతూ, మార్చి 6వ తేదీ మధ్యాహ్నం 12 గంటల లోగా https//apbragcet.apcfss.in వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. 5వ తరగతిలో ప్రవేశానికి ప్రభుత్వ లేదా గుర్తింపు పొందిన ప్రైవేటు పాఠశాలలో 4వ తరగతి, ఇంటర్‌లో చేరే విద్యార్థులు 10వ తరగతి పాసై ఉండాలన్నారు. 5వ తరగతిలో ప్రవేశానికి ఏప్రిల్ 6వ తేదీ ఉదయం పది గంటల నుంచి 12 గంటల వరకు, ఇంటర్ ఫస్టియర్‌లో ప్రవేశానికి అదే రోజు మధ్యాహ్నం రెండు గంటల నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు పరీక్ష వుంటుందన్నారు. ఇతర వివరాల కోసం 0891-2799641 నంబర్‌కు ఫోన్ చేసి సంప్రదించాలని ఆమె సూచించారు.

మరో ఫెర్రో కంపెనీ మూత

... 5వ పేజీ తరువాయి

ఎలా మూసేస్తాం? ఉత్పత్తయిన ఫెర్రోను మాత్రమే బయటకు పంపుతున్నాం. కార్మికులు యథావిధిగా విధులకు హాజరు కావచ్చు" అని చెప్పారు. దీంతో శాంతించిన కార్మికులు అప్పటి నుంచి విధులకు హాజరవుతున్నారు. కానీ యాజమాన్యం కర్మాగారంలో క్యాంటీన్‌ను మూసివేసింది. తర్వాత ఉద్యోగులను తీసుకువచ్చి, తిరిగి తీసుకెళ్లే బస్సులను ఆపేసింది. ఈ నేపథ్యంలో మంగళవారం నుంచి ఎవరూ విధులకు రావద్దంటూ యాజమాన్యం సోమవారం ప్రకటించింది. దీంతో తాము మోసపోయామని గ్రహించిన కార్మికులు ఆందోళనకు దిగారు. ముందస్తు నోటీసు ఇవ్వకుండా, రెండు నెలల బకాయి జీతాలు చెల్లించకుండా విధులకు రావద్దంటే ఎలా అని కార్మికులు ఆగ్రహం వ్యక్తం చేశారు. దీంతో దిగివచ్చిన యాజమాన్యం.. ఈనెల 25న జీతాలు చెల్లిస్తామని చెప్పడంతో కార్మికులు ఆందోళనను తాత్కాలికంగా విరమించారు.

గ్యాప్ ఏరియా సర్వే త్వరగా పూర్తి చేయండి

- ఏడు వేల ఎకరాలపై నెల రోజుల్లో నివేదిక ఇవ్వండి
- అధికారులకు కలెక్టర్ విజయకృష్ణన్ ఆదేశం

నాతవరం, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి) : నాతవరం మండలం సుందరకోట పంచాయతీ శివారు కొత్తదద్దుగుల దగ్గర ఉన్న ఏడు వేల ఎకరాల గ్యాప్ ఏరియాను రెవెన్యూ అధికారులు నెల రోజుల్లో సర్వే చేసి సరిహద్దులను నిర్ణయించి తనకు నివేదిక ఇవ్వాలని తహసీల్దార్ వేణుగోపాల్, మండల సర్వేయర్ ప్రసాద్‌లను కలెక్టర్ విజయ్‌కృష్ణన్ ఆదేశించారు. సోమవారం ఆమె శృంగవరం పెదిమికొండ దగ్గరల్లో ఉన్న భూములను, కొత్తదద్దుగుల వద్ద ఉన్న గ్యాప్ ఏరియాను పరిశీలించారు. స్థానిక రెవెన్యూ అధికారులు మాట్లాడుతూ డ్రోన్ సర్వే చేస్తేనే త్వరగా గ్యాప్ ఏరియా సర్వే పూర్తవుతుందని తెలిపారు. ఈ సందర్భంగా గిరిజనులు నాతవరం మండలంలో ఐదో షెడ్యూల్‌లో ఉన్న సుందరకోట, తదితర గ్రామాలను పాడేరు ఐటీడీఏలో విలీనం చేయాలని కలెక్టర్‌ను కోరారు. దీనికి ఆమె స్పందిస్తూ ఈ సమస్య తమ పరిశీలనలో ఉందన్నారు. కొత్తదద్దుగుల గ్రామానికి రహదారి సౌకర్యం లేదని, పురిటినొప్పులు వచ్చినప్పుడు వైద్యం కోసం గర్భిణులు చాలా అవస్థలు పడుతున్నారని తెలిపారు. కొత్తదద్దుగులలో పాఠశాల లేకపోవడంతో దూరంలో ఉన్న సుందరకోట పాఠశాలకు పిల్లలను పంపిస్తున్నట్టు గిరిజనులు తెలిపారు. అనంతరం శృంగవరం పెదిమికొండ ఫారెస్టు దగ్గరలో ఎస్ఈజడ్ ఏర్పాటుకు 100 ఎకరాలు అవసరం కావడంతో కలెక్టర్ విజయ్‌కృష్ణన్ ఆ వివరాలను తహసీల్దార్ వేణుగోపాల్‌ను అడగగా, ఈ ప్రాంతంలో 70 ఎకరాలు జిరాయితీ భూములు, 50 ఎకరాలు డి. పట్టాభూములు ఉన్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో నర్సీపట్నం ఆర్‌డీవో వీవీ రమణ, మండల సర్వేయర్ ప్రసాద్, స్థానిక రెవెన్యూ అధికారి హరి, తదితరులు పాల్గొన్నారు.



సుందరకోట పంచాయతీ శివారు కొత్తదద్దుగుల గ్రామస్థులతో మాట్లాడుతున్న కలెక్టర్ విజయ్‌కృష్ణన్

తేలని బార్క్ నిర్వాసితుల సమస్య

- సర్వే చేసి సాగుదారులను గుర్తిస్తామంటున్న అధికారులు
- నష్టపరిహారం నిర్ణయించిన తర్వాతే సర్వే చేయాలని నిర్వాసితుల పట్టు

అచ్యుతాపురం, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): బాబా అణు పరిశోధన కేంద్రం (బార్క్) నిర్వాసితుల సమస్య ఎన్నేళ్లయినా పరిష్కారానికి నోచుకోవడంలేదు. తొలుత భూములను సర్వే చేయడానికి సహకరించాలని, ఆ తర్వాత పరిహారం నిర్ణయిస్తామని అధికారులు చెబుతుండగా, ముందు ధర నిర్ణయించాలని, ఆ తరువాతే సర్వేకు అంగీకరిస్తామని నిర్వాసితులు స్పష్టం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో అనకాపల్లి ఆర్డీవో ఆయిషా సోమవారం దొప్పెర్లలో బార్క్ నిర్వాసితులను కలిశారు. ఇప్పటికిప్పుడు భూములను స్వాధీనం చేసుకోవడం లేదని, సాగులో ఎవరున్నారు? ఎవరికి పరిహారం ఇవ్వాలి? అనే దానిపై సర్వే చేస్తామని ఆమె చెప్పారు. ఇందుకు అచ్యుతాపురం డీటీ ఒక ఫార్మేట్‌ను సిద్ధం చేసి, అధికారులతో సర్వే జరిపి సాగుదారుల ఫొటోలతో ధ్రువీకరణ పత్రాలను ఇస్తామని, ఆ తర్వాత ధర నిర్ణయిస్తామని ఆర్డీఓ తెలిపారు. అయితే నిర్వాసిత రైతులు ఇందుకు ససేమిరా అన్నారు. నష్టపరిహారం ఎంతిస్తారో చెప్పండి, ఆ తరువాత సర్వే చేసుకోండి అని స్పష్టం చేశారు. దీంతో చేసేదేమీ లేక అధికారులు వెనుతిరిగారు.



బార్క్ నిర్వాసితులతో మాట్లాడుతున్న ఆర్‌డీఓ ఆయిషా

15 ఏళ్లుగా కొనసాగుతున్న సమస్య

బార్క్ ఉద్యోగుల నివాస కాలనీ నిర్మాణం కోసం దొప్పెర్ల పంచాయతీలోని వివిధ సర్వే నంబర్లలో 91.22 ఎకరాలను సేకరించాలని 2010 ఆగస్టులో ఏపీఐఐసీ అధికారులు నోటిఫికేషన్ జారీ చేశారు. కానీ ఎకరాకు ఎంత నష్టపరిహారం ఇస్తారన్నది అధికారులు వెల్లడించలేదు. సేకరించాల్సిన భూముల్లో జిరాయితీతోపాటు డి.పట్టా భూములు, ఎటువంటి పట్టాలు లేకుండా రైతులు సాగు చేసుకుంటున్న భూములు వున్నాయి. పట్టాలు లేకపోయినా.. పేద రైతుల సాగులో వున్న భూములకు కూడా పరిహారం ఇవ్వాలని నిర్వాసితులు పట్టుబడుతున్నారు. జిరాయితీ, పట్టా భూములకు మాత్రమే నష్టపరిహారం ఇస్తామని అధికారులు స్పష్టం చేస్తున్నారు. దీంతో దాదాపు 15 సంవత్సరాల నుంచి బార్క్ ఉద్యోగుల నివాస కాలనీకి భూ సేకరణ కొలిక్కి రావడంలేదు.

జీబీఎస్ కలకలం

... 5వ పేజీ తరువాయి

తగ్గిన వారం, పది రోజుల్లో కాళ్లు, చేతులు నీరసంగా ఉండడం,తిమ్మిర్లు ఎక్కడం, గొంతులోకి ముద్ద దిగకపోవడం, ఊపిరి తీసుకోవడంలో ఇబ్బంది ఉండడం, కాళ్లలో మంటలు వంటి లక్షణాలు కనిపిస్తే అప్రమత్తం కావాలని వైద్యులు సూచిస్తున్నారు. లక్షణాలు కనిపించిన వెంటనే వైద్య సేవలు పొందాలని, లేనిపక్షంలో ఊపిరి తీసుకోవడంలో ఇబ్బంది తలెత్తి ప్రాణాలు పోయే అవకాశం ఉందని చెబుతున్నారు.

ఈ జాగ్రత్తలు తప్పనిసరి..

కొన్ని జాగ్రత్తలు తీసుకోవడం ద్వారా ఈ వ్యాధి బారినపడకుండా ఉండవచ్చునని వైద్యులు చెబు తున్నారు. కాచి చల్లార్చిన నీటిని తాగాలి. వేడి ఆహార పదార్థాలు తీసుకోవాలి. బయట ఆహారానికి దూరంగా ఉండాలి. ఇన్‌ఫెక్షన్లు బారినపడకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలి. పోషకాలతో కూడిన ఆహారం తీసుకోవడం, శారీరక వ్యాయామాలు చేయడం, మంచి నిద్ర ద్వారా వ్యాధి నిరోధక శక్తిని పెంపొందించుకోవాలి.

నీరు-చెట్టు బిల్లులకు మోక్షం

... 5వ పేజీ తరువాయి

ప్రభుత్వం విచారణ చేయించింది. ఆ తరువాత ఇతర ఇంజనీరింగ్ విభాగాల ఇంజనీర్ల ద్వారా మరోసారి విచారణ నిర్వహించి కొన్ని పనుల్లో లోపాలు ఉన్నట్టు తేల్చారు. వాటికి సంబంధించి ఎం.బుక్‌లో నమోదుచేసిన బిల్లుల్లో కోత వేశారు. అవి మినహాయించి మిగిలిన బిల్లులు కూడా ఇవ్వలేదు. దీంతో పలువురు కోర్టును ఆశ్రయించడంతో వారికి అనుకూలంగా తీర్పులు వచ్చాయి. అయినా బిల్లులు ఇవ్వకపోవడంతో కోర్టు ధిక్కరణ పిటిషన్లు వేయడంతో గత ఏడాది నుంచి పలు దఫాలుగా 104 పనులకు రూ.3.1 కోట్లు మంజూరుచేశారు. మరో 616 పనులకు సంబంధించి రూ.39.1 కోట్లు బిల్లులు పెండింగ్‌లో ఉండిపోయాయి. కాగా కూటమి ప్రభుత్వ ఆదేశాలతో నీరు-చెట్టు కింద చేపట్టిన పనుల బిల్లులు అప్‌లోడ్ చేసే ప్రక్రియ వేగవంతం చేయాలని ఉన్నతాధికారులకు ఆదేశాలు అందాయి. ఈ ప్రక్రియ ముగిసిన తరువాత బిల్లులు మంజూరు చేస్తారని అధికారులు పేర్కొంటున్నారు.

నూకాంబిక ఆలయానికి మరో రోడ్డు

... 5వ పేజీ తరువాయి

మరిడిమాంబ ఆలయం నుంచి జాతీయ రహదారికి 1.2 కిలోమీటర్లమేర రోడ్డును విస్తరించాలని ప్రణాళిక రూపొందించారు. ప్రస్తుతం ఈ మార్గంలో ఎడ్లబండ్లు మాత్రమే వెళ్లేటంత వెడల్పు వుంది. దీనిని 30 అడుగులకు విస్తరించేందుకు చర్యలు చేపడుతున్నారు. పట్టణ ప్రణాళికా విభాగం అధికారులు సోమవారం ఈ మార్గాన్ని పరిశీలించారు. రోడ్డు విస్తరణ కోసం ఎంత మేర భూమిని సేకరించాలన్నదానిపై కసరత్తు చేస్తున్నారు. అమ్మవారిని దర్శించుకున్న తర్వాత తిరిగి వెళ్లేటప్పుడు మరిడిమాంబ ఆలయం నుంచి జాతీయ రహదారికి చేరే విధంగా ఈ రహదారి ఎంతో దోహదపడుతుంది. ఈ ప్రతిపాదన కార్యరూపం దాల్చితే తోటాడ జంక్షన్ నుంచి అమ్మవారి ఆలయానికి వచ్చే మార్గంలో ట్రాఫిక్ రద్దీ తగ్గుతుంది.

క్రైం... crime news

అతిగా మద్యం సేవించి ఒకరి మృతి

అనకాపల్లి టౌన్, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): అతిగా మద్యం సేవించిన ఒక వ్యక్తి మృతిచెందిన సంఘటన స్థానిక చింతావారివీధిలో ఆదివారం రాత్రిచోటు చేసుకుంది. పట్టణ ఎస్ఐ డి.ఈశ్వరరావు తెలిపిన వివరాల ప్రకారం.. రామకృష్ణ (స్థానికంగా అతనిని ఈ పేరుతోనే పిలుస్తుంటారు) మరుగుదొడ్లు శుభ్రం చేస్తూ.. వచ్చిన డబ్బులతో మద్యం సేవిస్తుంటాడు. ఆదివారం సాయంత్రం పూటుగా మద్యం సేవించాడు. అనంతరం రోడ్డుపై పడిపోయాడు. కొద్దిసేపటి తరువాత అటుగా వెళుతున్న వారు పరిశీలించగా అప్పటికే మృతిచెందాడు. ఇతనికి 45 ఏళ్లు వుంటాయని, ఆకుపచ్చ రంగు టీ షర్ట్, నలుపురంగు ట్రాక్ ధరించి వున్నాడని, మృతదేహాన్ని ఎన్టీఆర్ వైద్యాలయం మార్చురీకి తరలించామని ఎస్ఐ చెప్పారు.

బహిరంగంగా మద్యం సేవిస్తున్న 25 మందిపై కేసులు

అనకాపల్లి టౌన్, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని వివిధ ప్రాంతాల్లో బహిరంగంగా మద్యం సేవిస్తున్న 25 మందిపై కేసులు నమోదు చేసినట్టు పట్టణ ఎస్ఐ డి.ఈశ్వరరావు తెలిపారు. ఆదివారం రాత్రి ట్రైనీ డీఎస్పీ ఎంవీకే చైతన్య, సిబ్బందితో కలిసి పలు ప్రాంతాల్లో తనిఖీలు చేశామన్నారు. బహిరంగంగా మద్యం సేవిస్తున్న 25 మందిని అదుపులోకి తీసుకున్నట్టు చెప్పారు.

15 మద్యం సీసాలతో ఒకరి అరెస్టు

కొత్తూరు, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): అనకాపల్లి మండలం పిసినికాడ సమీపంలో ఉన్న మరిడిమాంబ ఆలయం వద్ద మద్యం విక్రయిస్తున్న ఏదురి నాయుడును అరెస్టు చేశామని ఎక్సైజ్ సీఐ వై.ఎల్.నాయుడు తెలిపారు. ఇతని నుంచి 15 మద్యం సీసాలను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశామని చెప్పారు.

20 కిలోల గంజాయితో ఇద్దరి అరెస్టు

చీడికాడ, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): స్థానిక అప్పలరాజుపురం కాటా వద్ద వాహనాల తనిఖీల్లో భాగంగా సోమవారం రాత్రి ఇద్దరిని అరెస్టు చేసి 20 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నామని ఎస్ఐ సతీశ్ తెలిపారు. ముందస్తు సమాచారం మేరకు అప్పలరాజుపురం కాటా వద్ద వాహనాలు తనిఖీ చేస్తుండగా తమిళనాడుకు చెందిన మహమ్మద్ హర్షఫ్, టి.యాబలిన్‌లు 20 కిలోల గంజాయితో పట్టుబడ్డారన్నారు. వీరు ముంచంగిపుట్టులో గంజాయి కొనుగోలు చేసి తెస్తుండగా పట్టుకొని కేసు నమోదు చేసి చోడవరం కోర్టుకు తరలించామని ఎస్ఐ తెలిపారు.

వ్యాన్ ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి మృతి

కశింకోట, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తాళ్లపాలెం వద్ద ఆదివారం అర్ధరాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో గుర్తు తెలియని వ్యక్తి మృతిచెందాడు. ఈ సంఘటనకు సంబంధించి సీఐ అల్లు స్వామినాయుడు తెలిపిన వివరాలు.. అనకాపల్లి నుంచి ఎలమంచిలి వైపు వెళుతున్న బొలెరో వ్యాన్ ఆదివారం అర్ధరాత్రి 11.30 గంటల సమయంలో తాళ్లపాలెం శివారున ఉన్న బ్రిడ్జి సమీపంలో రోడ్డు దాటుతున్న గుర్తు తెలియని వ్యక్తిని ఢీకొంది. దీంతో ఆ వ్యక్తి తల భాగం నుజ్జునుజ్జయ్యింది. ఇతను నేరేడు పండు రంగు షర్టు, నలుపు రంగు ప్యాంటు ధరించి వున్నాడు. వయసు సుమారు 40 ఏళ్లు ఉంటాయి. మృతదేహాన్ని అనకాపల్లి ఎన్టీఆర్ ఆస్పత్రి మార్చురీకి తరలించారు. తాళ్లపాలెం వీఆర్వో ఆర్.శ్రీనివాసరావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ తెలిపారు.

ఉపమాక వెంకన్నకు పూర్వ వైభవం

... 5వ పేజీ తరువాయి

ఉపమాక ఆలయాన్ని 2017లోనే టీటీడీకి అప్పగించారని, ఈ ఆలయాన్ని అభివృద్ధి చేసి పూర్వవైభవంగా తీసుకురావాలని కోరారు. ఈ సందర్భంగా ఛైర్మన్ టీటీడీ.. ఈవో శ్యామలరావు, చీఫ్ ఇంజనీర్ సత్యనారాయణను పిలిపించి ఉపమాక ఆలయ అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఛైర్మన్‌తో సమావేశం అనంతరం మంత్రి అనిత మీడియాతో మాట్లాడుతూ.. 2017లోనే సీఎం చంద్రబాబు ఉపమాక వేంకటేశ్వరస్వామి ఆలయాన్ని సందర్శించి అభివృద్ధి కోసం మాస్టర్‌ప్లాన్ సిద్ధం తయారు చేయించారని, అయితే ప్రభుత్వం మారిన తర్వాత ఉపమాక ఆలయం నిర్లక్ష్యానికి గురైందన్నారు.

కల్యాణోత్సవం సందర్భంగా స్వామివారికి ఒక రోజు మాత్రమే బంగారు ఆభరణాలను అలంకరిస్తున్నారని, ఆభరణాలను ఐదు రోజులపాటు వుంచాలని, ఉపమాక ఆలయంలో టీటీడీ లడ్డూ ప్రసాదాలను విక్రయించి, తిరుమల టికెట్ బుకింగ్ కౌంటర్‌ను ఏర్పాటు చేయాలని, ఉపమాక ఆలయంలో నిత్య అన్నదానం ప్రారంభించాలని విజ్ఞప్తి చేశారు. ఉపమాక ఆలయ ప్రాంగణంలో ఏసీ కల్యాణ మండపం, కొండపైకి వెళ్లే మెట్ల మార్గాన్ని వెడల్పు చేసి, షెడ్లు నిర్మించడం, నక్కపల్లి- ఉపమాక రహదారిని డబుల్ లేన్‌గా విస్తరించడం, కొండపైకి ఘాట్ రోడ్డు నిర్మాణం, భక్తులకు విశ్రాంతి భవనం వంటివి నిర్మించాలని ఆమె కోరారు. టీటీడీ ఛైర్మన్, అధికారుల సానుకూల స్పందనతో ఉపమాక ఆలయానికి పూర్వవైభవం వస్తుందనే నమ్మకం కలిగిందన్నారు. టీటీడీ ఛైర్మన్‌ను కలిసిన వారిలో జడ్పీ కో-ఆప్షన్ మాజీ సభ్యుడు కొప్పిశెట్టి కొండబాబు, టీడీపీ మండల అధ్యక్షుడు కొప్పిశెట్టి వెంకటేశ్, ఆలయ మాజీ ఛైర్మన్ బుజ్జి వున్నారు.

సీసీ రోడ్ల బిల్లులకు నిరీక్షణ

... 5వ పేజీ తరువాయి

ఇంతవరకు రూ.1.6 కోట్ల బిల్లులను అప్‌లోడ్ చేయగా రూ.40 లక్షలు మాత్రమే విడుదలయ్యాయి. ఇంకా రూ.1.2 కోట్ల బిల్లులు పెండింగ్‌లో వున్నాయి. నాతవరంలో రూ.2.50 కోట్లుకి రూ.20 లక్షలు మాత్రమే బిల్లులు మంజూరు అయ్యాయి. గొలుగొండలో రూ.1.6 కోట్లుకి రూ.25 లక్షలు, మాకవరపాలెంలో రూ.2 కోట్లుకి రూ.25 లక్షలు బిల్లులు పడ్డాయి. ఇంకా రూ.6.6 కోట్లు విడుదల కావాల్సి వుంది.

రెండు నెలల నుంచి ఆగిన బిల్లులు

ఉపాధి హామీ పథకం కింద చేపట్టిన సీసీ రోడ్ల బిల్లులను ప్రతి గురువారం చెల్లిస్తామని అప్పట్లో ప్రభుత్వం ప్రకటించింది. ఆ మేరకు గత ఏడాది డిసెంబరు రెండో గురువారం వరకు బిల్లులు మంజూరయ్యాయి. ఆ తర్వాత నుంచి బిల్లులు విడుదల కాలేదు. కాగా రెండు నెలల నుంచి సీసీ రోడ్ల బిల్లులు మంజూరు కాకపోవడంపై పంచాయతీరాజ్ డీఈఈ ఈశ్వరరావును 'ఆంధ్రజ్యోతి' వివరణ కోరగా, ఈ నెలాఖరుకు బిల్లులన్నీ మంజూరవుతాయని చెప్పారు. ఇప్పటికే మంజూరు చేసిన సీసీ రోడ్ల నిర్మాణ పనులన్నీ మార్చి పదో తేదీలోగా పూర్తిచేస్తామని తెలిపారు.

బెల్లం తయారీకి హైబ్రిడ్ యూనిట్

... 5వ పేజీ తరువాయి

అంతరాయం లేకుండా చెరకును క్రషింగ్ చేయవచ్చు. సౌరశక్తిని వినియోగించుకోవడం వల్ల విద్యుత్ చార్జీలు 60 శాతం వరకు ఆదా అవుతాయి. 28 ప్యానళ్ల సౌరశక్తితో ఏడు హెచ్‌పీ వరకు మోటార్లు పనిచేస్తాయని జగన్నాథరావు చెప్పారు. సోలార్ విద్యుదుత్పత్తి యూనిట్లకు ప్రభుత్వం రాయితీ కూడా ఇస్తుందన్నారు.

బయోమాస్ గ్యాసీఫైయర్

బెల్లం తయారీ కోసం చెరకు రసాన్ని మరిగించేందుకు బయోమాస్ గ్యాసీఫైయర్ పద్ధతి ద్వారా చెరకు పిప్పిని మండిస్తారు. బెల్లం పొయ్యిలో చెరకు పిప్పిని వేస్తూ గ్యాసీ ఫైయర్ సాయంతో తీవ్ర ఉష్ణానికి, ఒత్తిడికి గురి చేసి గ్యాస్‌గా మారుస్తారు. ఈ గ్యాస్ సాయంతో వచ్చే మంట నుంచి నుసి, దుమ్ము వెలవడనందున కాలుష్య సమస్యే ఉండదు. బయోగ్యాసీఫైయిర్ వల్ల థర్మల్ సామర్థ్యం 38 శాతం పెరుగుతుంది. 68 శాతం సమయం ఆదా అవుతుంది. టన్ను బెల్లం తయారీకి పది కిలోవాట్ల శక్తి ఆదా అవుతుంది. రెండు పాకాలు ఆడే సమయంలో మూడు పాకాలు తీయవచ్చు.

చికెన్ ధరలు	
బ్యాగ్	రూ.లలో
రైతు ధర	90.00
లైవ్ ధర	100.00
విత్ స్కిన్	190.00
స్కిన్ లెస్	200.00

కోడి గుడ్లు (నెక్)	
వంద గుడ్లు	రూ.లలో
విశాఖపట్నం	435
విజయనగరం	439
శ్రీకాకుళం	439